నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 1-10-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:52 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

చేకూర్చుకొనగ స్వాస్థ్యము
శాకాహారమ్ము మనకు సౌఖ్యద మనుచున్
శాకాహార దినమ్మును
ప్రాకటముగ జరుపవలయు పదుగురు మెచ్చన్ !!

(అక్టోబరు 1 ప్రపంచ శాకాహార దినం)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

నేతల మాటలకు
నీతులెక్కడుంటయి
అనుక్షణం అవినీతి
ఆలోచన్లే కంటయి
అదీ ఇదీ పార్టేదైనా
అన్నిటిలో అదే గుణం
నిత్యం వెంటతిరిగి
నమ్మినోళ్లే పిచ్చిజనం

-వేల్పుల నారాయణ
9440433475

దసరాకు ముందే డిఎస్‌సి నియమాకాలు -సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 30: రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి 1:3 ప్రాతిపదికన ఫలితాలు విడుదల చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మార్చి 1న డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశామని, జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 2,46,584 మంది హాజరు అయ్యారని తెలిపారు. 66 రోజుల్లో పరీక్షలు నిర్వహించి, ఫలితాలు విడుదల చేయడంలో పేద ప్రజల పట్ల మా చిత్తశుద్ధి కనిపిస్తోందన్నారు. విద్యాశాఖ అధికారులు అతి తక్కువ సమయంలో ఫలితాల కోసం విశేష కృషి చేశారని, వారి అందరినీ సీఎం అభినందించారు.

9లోగా నియామాకాలు

ఫైనల్ నియామకాలు దసరా పండుగ లోపు చేస్తామని సీఎం చెప్పారు. అక్టోబర్ తొమ్మిదో తేదీ లోపు సర్టిఫికెట్ వేరిఫికేషన్ చేసి ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందజేస్తామన్నారు. తెలంగాణలో దసరా పండుగ ప్రతీ ఒక్కరు ఘనంగా నిర్వహించుకుంటారని చెప్పారు. బీఆర్ ఎస్ పదేళ్లలో ఏడు వేల టీచర్ పోస్టులే భర్తీ చేశారని, అతి తక్కువ టైంలో 11 వేల 62 ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని ఆయన తెలిపారు.

త్వరలో గ్రూప్-1 ఫలితాల వెల్లడి

గ్రూప్-1 ఫలితాలను త్వరలో వెల్లడిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. టీజీపీస్సీని ప్రక్షాళన చేస్తామని కూడా చెప్పారు. గ్రూప్ 1 ఫలితాలు ప్రకటించి, వారిని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం చేస్తామన్నారు. తీవ్రమైన నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం గ్రూప్ 1,2,3 పోస్టులను అంగడి సరుకుల్లా మార్చిందని విమర్శించారు. మొదటి ఏడాదిలోనే 65 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

నావెల్ డాక్ యార్డు ఎదుట మహిళల ఆందోళన..

అమరావతి, సెప్టెంబర్ 30: నావెల్ డాక్ యార్డు ప్రధాన ద్వారం ఎదుట మహిళలు ఆందోళనకు దిగారు. తమ భర్తల ప్రాణాలకు సేఫ్టీ కావాలని డాక్ యార్డ్ ఉద్యోగస్తుల భార్యలు ఆందోళనకు దిగారు. నూతన వంతెన నిర్మాణం కోసం ఇటీవల రహదారిని పోర్ట్ యాజమాన్యం మూసివేసింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నావికాదళానికి చెందిన ఎస్ బీసీ నుండి రాకపోకలకు అనుమతి ఇవ్వాలంటూ సుమారు 200మంది మహిళలు ఆందోళనకు దిగారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి - మంత్రులు పొన్నం, సీతక్క సూచన

కరీంనగర్, సెప్టెంబర్ 30: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డ జన్మిస్తాడని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అన్నారు.

కరీంనగర్ జిల్లా మానకొండూరు బాలికల ఉన్నత పాఠశాలలో గ్రామ ఆరోగ్య పారిశుధ్య పోషణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం రుచి చూశారు.

సరైన జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముఖ్యంగా గర్భిణులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.

ఏజెన్సీలో రక్తహీనత సమస్య

పంచాతీయ రాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ ఏజెన్సీలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంటుందని అన్నారు. దీన్ని అధిగమించడం కోసం పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేల సత్పతి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు..

రాష్ట్రవ్యాప్తంగా 238 ప్రాంతాల్లో అయిదు రోజుల పాటు సాగనున్న ప్రక్రియ
పట్టణ/నగర ప్రాంతాల్లో జనాభా ఆధారంగా ఎక్కువ టీమ్‌లు
-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
కుటుంబ ఫొటో దిగడం ఆప్షన్ మాత్రమే..



హైదరాబాద్, సెప్టెంబర్ 30:తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న ప్రక్రియను సమర్థంగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఒక వేళ పూర్తిగా పట్టణ/నగర నియోజకవర్గమైతే రెండు వార్డులు/ డివిజన్లు, పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో మొత్తంగా 238 ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. వార్డులు/ డివిజన్లలో జనాభా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిశీలన బృందాల సంఖ్యను పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిట్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు, సేకరించే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్న గ్రామాలు, వార్డులు/ డివిజన్ల ఎంపిక పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. పైలెట్ ప్రాజెక్టును ఎన్ని రోజుల పాటు చేపడతారని సీఎం ప్రశ్నించారు. అక్టోబరు మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు అయిదు రోజుల పాటు చేపడతామని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంతా సమ్మతిస్తే కుటుంబం ఫొటో తీయాలని, అదో అప్షనల్ గా ఉండాలని, కుటుంబం సమ్మతి లేకుంటే ఆ ఫొటో తీసుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు సంబంధించి ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలని.. అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వం వద్దనున్న రేషన్ కార్డు, పింఛను-స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రుణమాఫీ, బీమా, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు తదితర డేటాల ఆధారంగా ఇప్పటికే కుటుంబాల గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, పైలెట్ ప్రాజెక్టులో దానిని నిర్ధారించుకోవడంతో పాటు కొత్త సభ్యులను జత చేయడం, మృతి చెందిన వారిని తొలగించడం చేస్తామని అధికారులు వివరించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులుచేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వవద్దని హెచ్చరించారు.

పైలెట్ ప్రాజెక్టుతో బయటకు వచ్చిన సానుకూలతలు, ఎదురైన ఇబ్బందులతో నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆ నివేదికపై చర్చించి లోపాలను పరిహరించిన అనంతర పూర్తి స్థాయి క్షేత్ర స్థాయి పరిశీలన చేపడదామని ముఖ్యమంత్రి తెలిపారు. సమీక్షలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శులు సంగీత సత్యనారాయణ, మాణిక్ రాజ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైడ్రా అంటే కూల్చివేతలే కాదు.. పేదల నివాసాల జోలికి వెళ్లదు.. స్పష్టం చేసిన ఏవీ రంగనాథ్

హైదరాబాద్, సెప్టెంబర్ 30:ఐ హైడ్రా అంటే కూల్చివేతలే కాదని కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. హైడ్రా పరిధి ఔటర్ రింగు రోడ్డు వరకే అని ఆయన తెలిపారు. నగరంలోనే కాదు.. రాష్ట్రంలో.. ఆఖరకు ఇతర రాష్ట్రాల్లో కూల్చివేతలను కూడా హైడ్రాకు ఆపాదించి సామాజిక మాధ్యమాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని అన్నారు.

హైడ్రా పేదల నివాసాల జోలికి వెళ్లదని ఏవీ రంగనాథ్ తెలిపారు. అలాగే నివాసం ఉంటే ఆ ఇళ్లను కూల్చదని చెప్పారు. కూల్చివేతలన్నీ హైడ్రావి కాదని స్పష్టం చేశారు. ప్రజలు, సామాజిక మాధ్యమాలు ఈ విషయాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటం, వర్షాలు, వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.

మూసీ నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదని కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అక్కి నివాసితులను హైడ్రా తరలించడం లేదని చెప్పారు. అక్కడ ఎలాంటి కూల్చివేతలను హైడ్రా చేపట్టడం లేదని పేర్కొన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ ప్రత్యేక ప్రాజెక్టు అని.. దాన్ని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని తెలిపారు.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు..

ఇజ్రాయెల్‌పై పోరాటం కొనసాగిస్తాం : హెజ్బొల్లా డిప్యూటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ హెజ్బొల్లా మధ్య యుద్ధం మరింత తీవ్రతరం అవుతున్నాయి. భీకర దాడులతో హెజ్బొల్లాకు చెందిన కీలక నేతలను ఇజ్రాయెల్ వరుసగా చంపేస్తుండంతో ఉద్రికత్తలు మరింత పెరిగాయి. హసన్ నస్రల్లా మరణానంతరం హెజ్బొల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్, తాత్కాలిక నాయకుడిగా నయీమ్ కస్సేమ్ ఎన్నికయ్యారు. ఈ నేపథ్యం లోనే ఆయన తొలిసారి మాట్లాడారు.

ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌పై పోరాటం కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఇక ఇజ్రాయెల్ భూతల దాడులను స్టార్ట్ చేయాలనుకుంటే అందుకు తాము కూడా రెడీగానే ఉన్నామని హెజ్బొల్లా డిప్యూటీ చీఫ్ నయీమ్ కస్సేమ్ తెలిపారు. హెజ్బొల్లాలోని కీలక మిలటరీ కమాండర్లను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు చేసిందని, కానీ ఆ దాడులు మా సైనిక సామర్థ్యాలను ప్రభావితం చేయలేకపోయాయని అన్నారు. మా సంస్థ సుదీర్ఘ యుద్ధానికి సిద్ధమైందని నయీమ్ కసేమ్ అన్నారు.

అయితే కొన్ని రోజులుగా హెజ్బొల్లా లక్ష్యంగా ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. బీరుట్‌పై జరిగిన దాడుల్లో హెజ్బొల్లా అధిపతి హసన్ నస్రల్లా మరణించారు. ఆ తర్వాత మరో కీలక నేతను కూడా ఐడీఎఫ్ దళాలు చంపేశాయి. దాడులు ప్రారంభమైన 10 రోజుల వ్యవధిలోనే నస్రల్లాతో సహా ఆరుగురు కీలక కమాండర్లను ఇజ్రాయెల్ హతమర్చింది. లెబనాన్‌లో 1000కి పైగా మంది ప్రాణాలు కోల్పోగా వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులు ఉన్నారు.

బీహార్‌లో వరద బీభత్సం.. బద్దలైన ఆరు బ్యారేజీలు

బిహార్, సెప్టెంబర్ 30: బీహార్ లో తీవ్రమైన వరద సంక్షోభం నెలకొంది. ఎగువన ఉన్న నేపాల్‌లో కురుస్తున్న వర్షాల ప్రభావం బీహార్‌పై పడింది. ముఖ్యంగా ఇండో ? నేపాల్ సరిహద్దు సమీపంలోని జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

మౌలిక సదుపాయాలు, వ్యవసాయ భూములుకు తీవ్ర నష్టం వాటిల్లింది. బీహార్ రాష్ట్రంలోని పలు ప్రధాన నదులు పొంగి పొర్లుతున్నాయి. మూడు రోజులుగా ఎగువన ఉన్న నేపాల్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆ వరదంతా దిగువన బిహార్ రాష్ట్రంలోని నదుల్లోకి వచ్చి చేరింది.

దీంతో రాష్ట్రంలో వరదల సంభవించాయి. కోసి, గండక్, బాగ్మతి సహా ప్రధాన నదులు పొంగి పొర్లుతున్నాయి. ఆదివారం ఆరు బ్యారేజీలు బద్దలవడంతో సమీపం లోని గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి.

తెగిపోయిన బాగ్మతి నది కరకట్ట..

నీతామర్హి జిల్లాలో కనీసం నాలుగు చోట్ల బాగ్మతి నది కరకట్ట తెగిపోయింది. పశ్చిమ చంపారన్, షెయోహార్ జిల్లాల్లో కట్టలు కూడా తెగిపోయాయి. పశ్చిమ చంపారన్‌లోని గండక్ నది ఉధృతితో వాల్మీకి టైగర్ రిజర్వ్‌లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరింది.

ముజఫర్‌పూర్‌లోని పవర్ గ్రిడ్ కంట్రోల్ రూమ్‌లోకి వరద నీరు ప్రవేశించింది. దీంతో ఏ క్షణంలోనైనా విద్యుత్ సరఫరా నిలిచిపోవచ్చని అధికారులు ముందస్తుగా హెచ్చరించారు. అదే జరిగితే దాదాపు 43 వేల మంది అంధకారంలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంది.

ఢిల్లీకి మళ్లీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణ ముఖ్యమంత్రి మళ్లీ ఢిల్లీకి వెళ్లనున్నారు. నేటి రాత్రి బేగంపేట్ విమానాశ్రయం నుంచి ఆయన ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లబోతున్నారు. అక్కడ అనేక మంది పార్టీ పెద్దలతో సమావేశం కానున్నారు. అంతేకాదు మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీ పై చర్చించనున్నారు. అస్వస్థకు గురైన మల్లికార్జున ఖర్గేను పరామర్శించనున్నారు. ఇదిలావుండగా దనరాలోపు మంత్రివర్గ విస్తరణ చేపట్టాలని రేవంత్ రెడ్డి యోచిస్తున్నారని సమాచారం.

పండుగల విషయంలో గందరగోళ పరిస్థితి తలెత్తకుండా సిద్ధాంతుల సమిష్టి నిర్ణయం

- సంప్రదాయ సిద్ధాంతాలను పాటిస్తూ సమాజానికి, ప్రభుత్వానికి మేలు జరిగేలా సమిష్టి నిర్ణయం
- వేదాంతాచార్య పీఠ ఆస్థాన సిద్ధాంతులు ఉ.వే.తి.న.చ సంపత్ కుమార కృష్ణమాచార్య సిద్ధాంతివెల్లడి

హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పండుగల విషయంలో గందరగోళ పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని సంప్రదాయ సిద్ధాంతాలను పాటిస్తూ సమాజానికి, ప్రభుత్వానికి మేలు జరిగేలా సమిష్టి నిర్ణయం తీసుకున్నట్లు వేదాంతాచార్య పీఠ ఆస్థాన సిద్ధాంతులు ఉ.వే.తి.న.చ సంపత్ కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి, శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవా సమితి(శ్వాస్) అధ్యక్షుడు యాదగిరి స్వామి తెలిపారు. సనాతన శాస్త్ర ప్రమాణాల ఆధారంగా విశ్వావసు సంవత్సర(2025-26)లో జరుగబోయే సాధారణ పండుగలు, విశేష పర్వదినాల తేదీలను నిర్ణయించి నట్లు వారు తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదర్ గూడ ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల శంషాబాద్ లోని ముచ్చిం తల్లో చిన్న జీయర్ స్వామి సమక్షంలో విశ్వావసు పంచాగ సిద్ధాంత నిర్ణాయక సభ జరిగిందని, ఈ సభకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దివ్య క్షేత్రాల ఆస్థాన సిద్ధాంతులు, వివిధ పీఠాల ఆ స్థాన సిద్ధాంతులు, ఇతర ప్రముఖ సిద్ధాంతులు 76 మంది హాజరై సమాజ శ్రేయస్సు, సనాతన ధర్మ వ్యాప్తిపై విపులంగా చర్చించినట్లు చెప్పారు.

జపాన్ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి ..

హైదరాబాద్, సెప్టెంబర్ 30: వారం రోజుల అమెరికా పర్యటన తర్వాత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు మూడు రోజుల పర్యటనకు జపాన్ చేరుకున్నారు.

సోమవారం మధ్యాహ్నం హానిడా విమానాశ్రయంలో దిగిన ఆయనకు భారత రాయబార కార్యాలయ ప్రతినిధులు అజయ్ సేథి, మధుసూదన్, అమన్ ఆకాష్ ఆయనకు స్వాగతం పలికారు.

ఆయనతోపాటు రాష్ట్ర బృందం లో ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణ రావు, ఇంధన శాఖ కార్యదర్శి డి. రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండి ఎన్ .బలరామ్ ఈ వర్యటన లో పాల్గొంటున్నారు.

పర్యావరణహిత పరిశ్రమలు, అత్యాధునిక మైనింగ్ సంబంధిత టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటు తదితర అంశాల పరిశీలనకై ఈ బృందం జపాన్ లోని పలు ప్రముఖ పరిశ్రమలను సందర్శించడంతోపాటు వివిధ దిగ్గజ కంపెనీలతో సమావేశాలు నిర్వహించనున్నది.

అభివృద్ధి పథంలో ముందుకు పోతున్న తెలంగాణ రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు పరిశ్రమలకు తోడ్పాటు, వివిధ పరిశ్రమల్లో భాగస్వామ్యం వంటి అంశాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆ దేశ ప్రముఖ కంపెనీల, పారిశ్రామికవేత్తలతో చర్చించనున్నారు.

ఇక ఈ పర్యటనలో భారత రాయబారి సిబి జార్జి ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి కి జపాన్ దేశంలో గల పరిశ్రమలు, తెలంగాణలో పెట్టుబడులకు, భాగస్వామ్య పరిశ్రమలకు గల అవకాశాలపై సంక్షిప్తంగా వివరించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి గౌరవార్థం భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన ఇందులో భట్టి విక్రమార్క ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

1వ తేదీ ఉదయం పెట్టుబడులతో వచ్చే కంపెనీల తో రౌండ్ టేబుల్ సమావేశం , వివిధ పారిశ్రామిక వేత్తల తో విడివిడిగా సమావేశాలు, అదే రోజు సాయంత్రం యమాంషి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ సందర్శన లో ఉప ముఖ్యమంత్రి పాల్గొంటారు. 2 వ తేదీన తోషిబా, కవాసాకి ,యాక్షహామ పరిశ్రమలను సందర్శిస్తారు. అదే రోజు రాత్రి ఒకాస చేరుకోని 3తేదీన పానాసోనిక్ హెడ్ క్వార్టర్స్ సందర్శిస్తారు. అనంతరం నాలుగో తేదీన రాష్ట్ర బృందం హైదరాబాద్ కు చేరుకోనుంది.

పండుటాకులను గుండెల్లో పెట్టుకొని కాపాడుకోలేమా?!

(01 అక్టోబర్ "అంతర్జాతీయ వయోవృద్ధుల దినం" సందర్భంగా)

మనలో కొందరు వాస్తవ వయస్సు కన్న యవ్వనంగా కనిపిస్తూ పొరుగు వారికి ఈర్ష్యాజనకంగా వెలిగి పోతుంటారు. మరి కొందరు తమ వయస్సు కన్న వృద్ధులుగా చర్మ ముడతలతో కనిపిస్తారు. 30-ఏండ్ల అసలు వయస్సు (క్రానలాజికల్ ఏజ్) ఉన్న యువకుడు ఏళ్ల తరబడి వ్యాయామం చేయకుండా, అధిక కొవ్వులు కలిగిన ఆహార పదార్థాలను తీసుకుంటూ, ఎక్కువ పొగ తాగడం, దురలవాట్లకు బానిసగా ఉన్నట్లయితే అతని జీవ సంబంధ వయస్సు (బయలాజికల్ ఏజ్) 30 ఏండ్ల కన్న చాలా అధికంగా కనిపిస్తుందని శాస్త్రపరిశోధనలు తెలుపుతున్నాయి. సాధారణంగా మన పుట్టిన తేదీ ఆధారంగా లెక్కించి చెప్పే వాస్తవ వయస్సును కాలక్రమానుసార వయస్సు(క్రొనలాజికల్ ఏజ్)గా, ఎదుటి వారికి మనం కనిపించే వయస్సును జీవసంబంధ (బయలాజికల్ ఏజ్) వయస్సుగా పిలవడం జరుగుతుంది. ఈ విధంగా వ్యక్తి వాస్తవ వయస్సు కన్న తక్కువ లేదా ఎక్కువ వయస్సు ఉన్నట్లు కనిపించడం సర్వసాధారణం. కొందరు వాస్తవ వయస్సు కన్న యవ్వనంగా, మరి కొందరు అసలు వయస్సు కన్న వృద్ధులుగా కనిపిస్తారు. జన్మ తేదీ ఆధారంగా వాస్తవ కాలక్రమానుసార వయస్సు ఆధారపడితే, బయలాజికల్ ఏజ్‌ని మాత్రం జన్యు మార్పులు (డియన్‌ఏ మిథైలేషన్), వ్యక్తి జీవనశైలిని బట్టి ఆధారపడి ఉంటుంది.

అంతర్జాతీయ వయోవృద్ధుల దినం-2024:

1990లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 01 అక్టోబర్‌న అంతర్జాతీయ వయోవృద్ధుల దినం పాటించుట ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ వయోవృద్ధుల దినం-2024 థీమ్‌గా "ప్రపంచవ్యాప్తంగా వయోవృద్ధుల సంరక్షణ, అవసర చేయూత" అనే అంశాన్ని తీసుకోని ప్రచారం చేస్తున్నారు. వృద్ధుల పట్ల డిజిటల్ తరం చూపిస్తున్న నిర్లక్ష్యం ధోరణిని పరిగణలోకి తీసుకొని, వయోవృద్ధుల సమస్యలను చర్చించడానికి ఈ వేదికలు ఉపయోగపడతాయి. నిన్నటి యోధులైన నేటి వృద్ధులను గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవలసిన కనీస బాధ్యత సంతానం, కుటుంబ సభ్యులు, ఇతర సంబంధిత వ్యక్తులు, పౌర సమాజం మీద ఉందని గమనించాలి. 2022 వివరాల ప్రకారం, 65 ఏండ్లు దాటిన ప్రపంచ వయోవృద్ధుల జనాభా 77 కోట్లు ఉండగా, భారతంలో 60 ఏండ్ల వయస్సు దాటిన జనాభా దాదాపు 15 కోట్లు ఉన్నది. 2050 నాటికి ప్రపంచ వృద్ధుల జనాభా 16 శాతానికి చేరవచ్చని అంచనా వేస్తున్నారు. వైద్య ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి రావడం, ఆహార భద్రతలో ముందడుగు పడడం, పేదరికం క్రమంగా తగ్గడంతో ప్రపంచవ్యాప్తంగా సగటు ఆయుర్దాయం(ప్రపంచ సగటు ఆయుర్దాయం 72.81 ఏండ్లు, భారత్‌లో 70.42 ఏండ్లు), వృద్ధుల జనాభా క్రమంగా పెరుగుతోందని అర్థం చేసుకోవాలి.

వృద్ధాప్యంలో రకాలు:

ప్రతి ఒక్కరు తమ వాస్తవ వయస్సు కన్న యవ్వనంగా కనిపించడానికే ఇష్టపడతారు. మన జీవనయానంలో శరీర అంతర్భాగాలు ఏ పరిమాణంలో డామేజ్ అయ్యాయనే విషయాలను బట్టి మన బయలాజికల్ వయస్సు ఆధారపడి ఉంటుంది. వృద్ధాప్యం మూడు రకాలుగా కనిపిస్తుంది. బయలాజికల్ ఏజింగ్ (శరీర కదలికలు/అవయవ నిర్మాణ ఆధారంగా కనిపించే వయస్సు), మానసిక వృద్ధాప్యం (సైకలాజికల్ ఏజింగ్), సామాజిక వృద్ధాప్యం (సోషల్ ఏజింగ్) అనబడే ఏజింగ్ ప్రక్రియలు ఉన్నాయి. వయస్సు, ఎత్తుకు సరితూగే శరీర బరువు కలిగి ఉండడం, నిత్యం శారీరక వ్యాయామం చేయడం, తరుచుగా వైద్య పరీక్షలు చేసుకుంటూ ఆరోగ్య సూత్రాలను పాటించడం, పండ్లు/కూరగాయలు/ఆకుకూరలు అధికంగా తీసుకోవడం, వృత్తి ఉద్యోగ ఒత్తిడిని తగ్గించుకోవడం, సమతుల జీవనశైలిని పాటించడం, రోజుకు 7 - 8 గంటలు నిద్ర పోవడం లాంటి మంచి అలవాట్లు కలిగిన వారు తక్కువ వయస్సు ఉన్నట్లు కనిపిస్తారు. మెదడులో వచ్చే సహజ మార్పులు, శారీరక చురుకుదనం, మానవ సంబంధాలు, భావోద్వేగాల నియంత్రణలు, ప్రవర్తనలను బట్టి సైకలాజికల్ ఏజింగ్ మారుతుంది. మంచి ఆహారాన్ని తీసుకోవడంతో మెదడు చురుకుదనం పెరుగుతుంది. శారీరక మానసిక ఒత్తిడికి లొంగినపుడు వ్యక్తి అసలు వయస్సు కన్న ఎక్కువగా కనిపిస్తాడు. సామాజిక అలవాట్లు, ప్రవర్తనలో మార్పులు, ఆరోగ్యకర మానవ సంబంధాల నెట్‌వర్క్ ఎల్లవేళల పనిని కల్పించుకొని ఇష్టపడి చేయడం, పరిసరాల పరిశుభ్రత లాంటివి సోషల్ ఏజింగ్‌ను ప్రభావితం చేస్తాయి.

యవ్వనంగా కనిపించడం ఎలా ?

పుట్టిన తేదీని బట్టి క్రానలాజికల్ ఏజ్‌ను కచ్చితంగా ఏండ్లు, నెలలు, రోజులు, గంటలు, నిమిషాల్లో నిర్ణయించవచ్చు. జీవయాత్రలో శరీర అవయవాలు, చర్మం, ఇతర అవయవ కణజాలాలకు జరిగి నష్టాలను బట్టి బయలాజికల్ ఏజ్ కనిపిస్తుంది. మన శరీరంలోని జన్యువుల్లో మార్పులు, జీవనశైలి, పోషకాహారం, వ్యాధులు లాంటి కారణాలతో బయలాజికల్ ఏజ్ మారుతుంది. మన నిజ వయస్సు కన్న యవ్వనంగా కనిపించడానికి సరైన శారీరక వ్యాయామం చేయుట ద్వారా బిపి, షుగర్, గుండె జబ్బులు, కీళ్ళ నొప్పులకు దూరంగా ఉంటూ యవ్వనంగా కనిపించుట జరుగుతుంది. అధిక బరువు లేదా స్థూలకాయ సమస్యలతో సతమతమయ్యే వారి బయలాజికల్ ఏజ్ ఎక్కువగా కనిపిస్తుంది. పండ్లు, చిక్కుడు గింజలు, అధిక పీచు కలిగిన పదార్థాలు, అల్ప కొవ్వుల ఆహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలను అధికంగా తీసుకుంటూ తమ వయస్సు కన్న యవ్వనంగా కనిపించేలా ప్రయత్నం చేయాలి. పాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్, సోడా ద్రావణాలు, బేకరీ పదార్థాలు లాంటివి అధికంగా వినియోగించే వారికి వృద్ధాప్యం తొందరగా వస్తుందని అంటున్నారు. జీవితకాలం (లైఫ్‌స్పాన్), ఆరోగ్యకాలం (హెల్త్‌స్పాన్) వేరు వేరు అంశాలుగా భావించాలి. క్రానలాజికల్ వయస్సు పెరిగితే సగటు జీవితకాలం కూడా పెరిగి ఆరోగ్యకర సమాజాన్ని సూచిస్తుంది. ఆరోగ్యకాలం పెరిగితే సమాజంలో ఆరోగ్యం నెలకొని అసలు వయస్సు కన్న యవ్వనంగా కనిపిస్తారు.

ఆనందంతో జీవించే కళను నేర్చుకుందాం:

మన వయస్సు కన్న చురుకుగా, చర్మ మెరుపులను కలిగి సక్రమమైన జీవనశైలిని అవలంబిస్తూ, సంపూర్ణ ఆరోగ్యంతో వాస్తవ వయస్సు కన్న యవ్వనంగా కనుపించడానికి ప్రయత్నం చేద్దాం, మనం ఎదుగుతూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం తీసుకుందాం. వయస్సు శరీరానికే అని, మనసుకు కాదని రుజువు చేద్దాం. వాస్తవ వయస్సు అంకెలు మాత్రమే అని, మానసిక ఉత్సాహంతో యవ్వనులుగా జీవించడం ఓ కళ అని తెలుసుకుందాం, మన అసలు వయస్సు కన్న యవ్వనంగా చురుకుదనంతో కదులుతూ జీవితాన్ని పూర్తిగా ఆస్వాదిద్దాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

జాతీయ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక సంస్థ ఆధ్వర్యంలో 'యువ రోజగార్ మేళా'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికరంగ జాతీయ సంస్థ (ఎన్ఐఈఎల్ఐటీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సంస్థ కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖకు చెందిన స్వతంత్ర శాస్త్ర విజ్ఞాన సంస్థ. యువ రోజ్ గార్ మేళా పేరుతో ఈ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 29న నిర్వహించారు. ఎన్ఐఈఎల్ఐటీకి చెందిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం ఆ సంస్థ ఢిల్లీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 16 కంపెనీలు వేయికి పైగా ఉద్యోగాల కోసం అభ్యర్థులను ప్రాథమికంగా ఎంపిక చేసుకున్నాయి. ఈ జాబ్ మేళాలో 1300 మందికిపైగా అభ్యర్థులు పేర్లను నమోదు చేసుకున్నారు.

నైపుణ్య అంతరాల తొలగింపు

ఎన్ఐఈఎల్ఐటీ డైరెక్టర్ జనరల్, ఎన్ఐఈఎల్ఐటీ డీమ్డ్ టుబి యూనివర్సిటీ గౌరవ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు ఢిల్లీ ఎన్ఐఈఎల్ఐటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ సుభాన్షు తివారీ స్వాగతం పలికారు. శ్రీ త్రిపాఠి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆహుతులను ఉద్దేశించి ప్రసంగించారు.

ప్రతి సంవత్సరం దేశమంతటా ఎన్ఐఈఎల్ఐటీ నిర్వహించే జాబ్ మేళాల ప్రాముఖ్యతను డాక్టర్ త్రిపాఠి తన ప్రారంభ ఉపన్యాసంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ఏడాది ఎన్ఐఈఎల్ఐటీ భారతదేశ వ్యాప్తంగా నిర్వహించిన జాబ్ మేళాల్లో కనీసం 6000 ఆఫర్ లెటర్లను అభ్యర్థులకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది ఆ సంఖ్యను పెంచబోతున్నట్లు చెప్పారు. జాబ్ మేళాలు- నైపుణ్యం కలిగిన విద్యార్థులు ఉద్యోగాలను పొందేందుకు, సంస్థల వృద్ధికి దోహదపడతాయని, ఆర్థిక పురోగతిని బలోపేతం చేస్తాయని అన్నారు. ఢిల్లీలో ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు ఎన్ఐఈఎల్ఐటీ ఢిల్లీ బృందం చేస్తున్న కృషిని ఆయన అభినందిం చారు. జాబ్ మేళాలో పాల్గొన్న కంపెనీలను కూడా ఆయన అభినం దించారు.

ఈ సందర్భంగా జాబ్ మేళాలో పాల్గొన్న వారికి సాఫ్ట్ స్కిల్స్- సీవీ తయారీ అనే అంశంపై నమాచారపూర్వక సాంకేతిక సమావేశాన్ని నిర్వహించారు. దీన్ని కేంద ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖకు చెందిన డిజిటల్ ఇండియా కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీ మొహమ్మద్ జునెయిద్ నిర్వహించారు.

ఈ సందర్భంగా టెక్ మహీంద్రా, పేటీఎం, ఫ్రాంక్‌ఫిన్ (షాప్సీ గ్లోబల్ సర్వీసెస్), యాక్సిస్ బ్యాంక్, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్, యాక్సెస్ హెల్త్ కేర్, కార్డ్ ఎక్స్‌పర్ట్జెజ్ ఇండియా, ఎబిక్స్ క్యాష్, ఐ ప్రాసెస్, పిఎన్ బి మెట్‌లైఫ్, సిద్ధి ఇన్ఫోనెట్+సోనీ, ది ఖుష్బూ కన్సల్టింగ్ పార్ట్‌నర్స్ (ప్రొఫెషనల్ రిక్రూట్‌మెంట్ అండ్ కన్సల్టెంట్), వీ కాస్మోస్, కైడోకో, శ్రీజీ ఎంటర్‌టైన్‌మెంట్, రిట్రాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్ వంటి కంపెనీల కోసం ప్లేస్‌మెంట్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికరంగ జాతీయ సంస్థ (ఎన్ఐఈఎల్ఐటీ)

గత కొన్ని సంవత్సరాలుగా సమాచార, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐఈసీటీ) రంగంలోను, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల విషయంలోనూ ఎన్ఐఈఎల్ఐటీ ఒక ప్రధాన సంస్థగా గుర్తింపు పొందింది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా సంబంధాలు ఉన్నాయి. ఇందులో 52 కు పైగా సొంత, విస్తరణ కేంద్రాలున్నాయి. వీటితోపాటు మరెన్నో ఔత్సాహిక కేంద్రాలు, 8 వేలకు పైగా శిక్షణ కేంద్రాలు ఉన్నాయి.

ఐజ్వాల్, అగర్తల, ఔరంగాబాద్, కాలికట్, గోరఖ్‌పూర్, ఇంఫాల్, ఇటానగర్, కేక్రీ, కోహిమా, పాట్నా, శ్రీనగర్‌లలో ఉన్న 11 భాగస్వామ్య విభాగాలతో కలిపి పంజాబ్ లోని రోపర్ ఎన్ఐఈఎల్ఐటీకి ప్రత్యేకమైన కేటగిరీ కింద డీమ్డ్ టు బి యూనివర్సిటీ హోదా మంజూరు చేశారు.

జాబ్ ఫెయిర్- యువ రోజ్‌గార్ మేళా

ఎన్ఐఈఎల్ఐటీ నిర్వహిస్తున్న జాబ్ ఫెయిర్ - "యువ రోజ్‌గర్ మేళా" అనేది ఆ సంస్థ విద్యార్థులకు సమగ్రమైన సహాయాన్ని అందించడంలో సంస్థకున్న అచంచలమైన నిబద్ధతను సూచిస్తోంది. విద్యార్థుల్లో సామర్థ్య పెంపుదలకు, నైపుణ్యాభివృద్ధికి, ఉద్యోగాల సాధనకు దోహదం చేస్తోంది.

రాబోయే సంవత్సరాల్లో ఇటువంటి మరిన్ని ఉద్యోగ మేళాలను నిర్వహించడానికి కట్టుబడి ఉన్నట్లు ఎన్ఐఈఎల్ఐటీ ప్రకటించింది.

దసరా సెలవుల వేళ అరకుకు ప్రత్యేక రైళ్లు..

అమరావతి, సెప్టెంబర్ 30: ఒక వైపు దసరా సెలవులు.. మరో వైపు వర్షాల సీజన్ ముగియవచ్చింది.. ఇక, ఇప్పటికే అరకు వాతావరణంలో మార్పులు వస్తున్నాయి.. ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.. మంచు కురుస్తోంది.. ఈ సమయంలో ఎవరైనా అరకు పర్యటనకు వెళ్లేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు.. ఇప్పుడు దసరా సెలవులు కూడా తోడు కావడంతో పర్యాటకులను ఆకర్షించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది రైల్వేశాఖ.

పర్యాటకుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్టు ప్రకటించింది.. అక్టోబర్ 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అరకుకు ప్రత్యేక రైలు నడపనుంది రైల్వే శాఖ. దసరా సీజన్ సందర్భంగా పర్యాటకుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు పేర్కొంది.. రైల్వేశాఖ తీసుకొస్తున్న ఈ ప్రత్యేక రైలు 5వ తేదీ నుంచి 15వ తేదీ మధ్య ప్రతీ రోజు ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాలకు విశాఖలో బయలుదేరి 11 గంటల 30 నిమిషాలకు అరకు చేరుకోనున్న ప్రత్యేక రైలు.. తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు అరకు నుంచి ఈ రైలు బయలుదేరి సాయంత్రం ఆరు గంటలకు విశాఖ చేరుతుందని న ప్రకటనలో పేర్కొంది రైల్వేశాఖ

పిడుగు బాధితులకు పరిహారం అందజేసిన మంత్రి సవిత..

అమరావతి, సెప్టెంబర్ 30: పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం దిగువ గంగంపల్లి తండాలో ఆదివారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో పిడుగుపడి మృతిచెందిన గిరిజన దంపతుల కుటుంబ సభ్యులకు ఇవాళ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ప్రభుత్వం తరపున పరిహారం పంపిణీ చేశారు.

ఇదే దుర్ఘటనలో గాయపడిన గిరిజన దంపతుల కుమారుడు జగదీష్ నాయక్ కు ఎనిమిది లక్షల 75 వేల రూపాయల చెక్కును అందజేశారు. పిడుగు పడిన దుర్ఘటనలో దశరథ్ నాయక్, దేవిబాయి వీరితో పాటు రెండు పాడి ఆవులు మృతిచెందిన విషయం తెలిసిందే.

మృతులకు ఒక్కొక్కరికి నాలుగు లక్షల చొప్పున ఎనిమిది లక్షలు, అదేవిధంగా రెండు పాడి ఆవులకు గాను రూ.75000లు మొత్తం 8,75,000 చెక్కును మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, తదితరులున్నారు.

నావెల్ డాక్ యార్డు ఎదుట మహిళల ఆందోళన..

అమరావతి, సెప్టెంబర్ 30:నావెల్ డాక్ యార్డు ప్రధాన ద్వారం ఎదుట మహిళలు ఆందోళనకు దిగారు. తమ భర్తల ప్రాణాలకు సేఫ్టీ కావాలని డాక్ యార్డ్ ఉద్యోగస్తుల భార్యలు ఆందోళనకు దిగారు. నూతన వంతెన నిర్మాణం కోసం ఇటీవల రహదారిని పోర్ట్ యాజమాన్యం మూసివేసింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నావికాదళానికి చెందిన ఎస్ బీసీ నుండి రాకపోకలకు అనుమతి ఇవ్వాలంటూ సుమారు 200మంది మహిళలు ఆందోళనకు దిగారు.

శ్రీ మిథున్ చక్రవర్తి కి దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం: ప్రధాన మంత్రి అభినందనలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: భారత చలనచిత్ర రంగానికి అందించిన అసమానమైన సేవలకు గాను ప్రతిష్ఠాత్మక 'దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని' శ్రీ మిథున్ చక్రవర్తికి ప్రదానం చేయనున్న నేపథ్యంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ఆయనకు అభినందనలు తెలియజేశారు. శ్రీ మిథున్ చక్రవర్తి సాంస్కృతిక రంగంలో ఓ ప్రముఖుడు; ఆయన బహుముఖ పాత్రపోషణ ప్రతిభ ప్రేక్షకలోకంలో తరాలకు అతీతంగా ప్రశంసలకు పాత్రమైందంటూ శ్రీ నరేంద్ర మోదీ కొనియాడారు.

కేంద్ర మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ సామాజిక ప్రసార మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఒక సందేశానికి ప్రధాన మంత్రి ప్రతిస్పందిస్తూ, తన అభిప్రాయాన్ని ఈ కింది విధంగా వ్యక్తం చేశారు:

"భారత చలనచిత్ర రంగానికి శ్రీ మిథున్ చక్రవర్తి అందించిన సాటిలేనటువంటి సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాకరమైన దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించడం నాకు సంతోషాన్ని కలిగించింది. సాంస్కృతిక రంగంలో ఆయనో ప్రముఖుడు, అనేక విధాల పాత్రలను చాలా ప్రతిభాన్వితంగా ఆయన పోషించిన తీరు తరాలకు అతీతంగా ప్రేక్షకుల అభిమానానికి నోచుకొంది. ఆయనకు ఇవే అభినందనలు, శుభాకాంక్షలు కూడా..."

ప్రపంచ భారతీయ తత్వవేత్త ఆచార్య సచ్చిదానందమూర్తి : వెంకయ్య నాయుడు

అమరావతి, సెప్టెంబర్ 30: సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆప్రో ఏషియన్ ఫిలాసఫీస్ ఆధ్వర్యంలో సోమవారం పద్మ విభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి విజన్ ఆన్ ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్ రిఫ్లెక్షన్స్ ఆన్ 21 సెంచరీ ఎడ్యుకేషనల్ పాలసీ అండ్ ప్లానింగ్ ఇన్ ఇండియా అనే అంశంపై ఏర్పాటు చేసిన జాతీయ సదస్సును మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన ఆచార్య సచ్చిదానందమూర్తి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన భారతీయ తత్వవేత్తగా ఆచార్య సచ్చిదానందమూర్తి పేరు గాంచారన్నారు. నేటి యువత సచ్చిదానందమూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, న్యూఢిల్లీలో యుపిఎస్సి మాజీ సభ్యులు ఆచార్య కేఎస్.చలం, ఢిల్లీ విశ్వవిద్యాలయం ఫిలాసఫీ విశ్రాంత ఆచార్యులు ఆచార్య అశోక్ ఓహరా, ఏఎన్యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, గౌరవ అతిథులు ఏఎన్యూ తాత్కాలిక రెక్టార్ ఆచార్య కే.రత్న షీలామణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం సచ్చిదానందమూర్తి సేవలను కొనియాడారు.

పవన్ మాటలను నేను పూర్తిగా సమర్థిస్తున్నా : నాగబాబు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: మన హిందూ ధర్మం ప్రమాదంలో ఉందనడానికి లడ్డూ అంశం క్లైమాక్స్ లాంటిదని జనసేన పార్టీ జాతీయ కార్యదర్శి నాగబాబు అన్నారు. సనాతన ధర్మం బతకడం నేర్పించిందని, దానికి అన్యాయం జరుగుతోందనే విషయాన్నే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేవనెత్తారని ఆయన తెలిపారు. ఇవాళ ఆయన మీడియాతో ఈ వ్యాఖ్యలు చేశారు.

'పవన్ కల్యాణ్ మాటలను పూర్తిగా సమర్థిస్తున్నా. హిందూ దేవాలయాలు, ధార్మిక మండళ్లు హిందువులే నిర్వహించాలి. ప్రభుత్వాల నిర్ణయాలు కోట్లాది మంది హిందువులపై ప్రభావం చూపుతున్నాయనేదే పవన్ కల్యాణ్ బాధ. అన్ని మతాలతో కలిసి ఉండే వ్యక్తి పవన్ కల్యాణ్. హిందూ ధర్మ రక్షణ వ

చట్టం తన పని తాను చేసుకుపోతుందని, దోషులెవరున్నా బయటపడక తప్పదని వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న విమర్శలకు సమాధానాలు చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు.

మూసీ బాధితులను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 30:హైదర్షాకోట్‌లోని మూసీ బాధితులను మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రా రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, బీఆర్ఎస్ నాయకులు కార్తీక్ రెడ్డితో కలిసి గురువారం పరామర్శించారు. బాధితులు ఇళ్లు కూల్చివేయకుండా అడ్డుకుంటావని, బుల్డోజర్లు, జేసీబీలు ఎన్నొచ్చినా తమను దాటుకొని వెళ్లాలన్నారు.

బాధితులందరూ ధైర్యంగా ఉండాలని, ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని, హైడ్రా ఫుణ్యమా అని ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, అలాంటి పరిస్థితి రాకుండా తాము వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఇందిరమ్మ పాలన అంటే పేదలకు కూడు, గూడు ఇచ్చేదని, కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మాత్రం పేదల బతుకులను కూల్చివేసే ప్రయత్నం చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డి పనితీరుపై మండిపడ్డారు. అవసరమైతే మూసీ తీరంలో ఏరియాకు ఒక ఎమ్మెల్యే ఉండి వారి ఇండ్లను కూల్చివేయకుండా కాపాడుతామని బాధితులకు హామీ ఇచ్చారు.

బస్సు ప్రయాణీకులకు బిగ్ షాక్..

–నేటినుంచి పెరగనున్న టికెట్ ధరలు..

-అక్టోబర్ 1 నుంచి టికెట్లు బుక్ చేసుకుంటే డబుల్ ఛార్జీలు చెల్లించాల్సిందే

హైదరాబాద్ సెప్టెంబర్ 30)ఎక్స్ ప్రెస్ న్యూస్);అక్టోబర్ 1 నుంచి టికెట్లు బుక్ చేసుకుంటే డబుల్ ఛార్జీలు చెల్లించాల్సిందే. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి విశాఖపట్టణానికి నాన్ ఏసీ బస్సులో రూ.1000కి టికెట్ లభిస్తే.. రేపు అదే బస్సులో టికెట్ రూ.1500 నుంచి రూ.2000కు పెరగనుంది. మీరు వారంతాల్లో లేదా పండుగలకు ఊరువెళ్లాలంటే ప్రయివేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణిస్తున్నారా.. ఆర్టీసీతో సమాన ధరలకే మీరు ఇప్పటివరకు టికెట్లు బుక్ చేసుకున్నారా.. అయితే మీకు ఇది తప్పకుండా బ్యాడ్ న్యూస్. ఇక నుంచి మీ జేబులకు చిల్లు పడనుంది. ఓ వైపు దసరా సీజన్ ప్రారంభం కానుండటంతో ప్రయివేట్ ట్రావెల్స్ టికెట్ల ధరలను అమాంతం పెంచేశాయి. దాదాపు వంద నుంచి రెండు వందల శాతం ధరలను పెంచేశాయి. పండుగకు 10 రోజుల ముందు నుంచే పెరిగిన టికెట్ల ధరలు అందుబాటులోకి రానున్నాయి. అక్టోబర్ 1 నుంచి టికెట్లు బుక్ చేసుకుంటే డబుల్ ఛార్జీలు చెల్లించాల్సిందే. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి విశాఖపట్టణానికి నాన్ ఏసీ బస్సులో రూ.1000కి టికెట్ లభిస్తే.. రేపు అదే బస్సులో టికెట్ రూ.1500 నుంచి రూ.2000కు పెరగనుంది. అక్టోబర్ 4,5,6 తేదీల్లో ఈ టికెట్ ధరలు మరింత ఎక్కువుగా ఉండనున్నాయి. అంతేకాదు నవంబర్‌లోనూ బస్సు టికెట్ ధరలు అధికంగా చూపిస్తున్నాయి. ఎటువంటి పండుగలు లేకపోయినా నవంబర్, డిసెంబర్ నెలలో ఏసీ సీటర్ హైదరాబాద్ నుంచి విశాఖకు రూ.2900 ఉండగా.. స్లీపర్ రూ.3,100 చూపిస్తుంది. ఇదే బస్సులో సెప్టెంబర్ 30వ తేదీన స్లీపర్ టికెట్ ధర రూ.1200 ఉండగా నవంబర్, డిసెంబర్‌లో దాదాపు రూ.3,000 చూపిస్తుంది. ఇదే బస్సులో అక్టోబర్ 1న స్లీపర్ టికెట్ రూ.1400 చూపిస్తుంది. అక్టోబర్ 1 నుంచి ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు టికెట్ ధరలు భారీగా పెరగనున్నాయి.

హైదరాబాద్ నుంచి యానం, హైదరాబాద్ నుంచి విశాఖపట్టణం వెళ్లే ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ధరలు సరాసరి సెప్టెంబర్ 30వ తేదీన నాన్ ఏసీ టికెట్ రూ.800 నుంచి 1500 వరకు ఉండగా.. అక్టోబర్ ఒకటి నుంచి ఒక్కో టికెట్‌పై రెండు వందల నుంచి ఐదు వందల వరకు పెరగనుంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్టణం వరకు ఒక్కో టికెట్‌పై రూ.300 నుంచి 500 వరకు పెరగనుంది. ఏపీఎన్ఆర్టీసీ, టీఎస్ఆర్టీసీ బస్సులో అక్టోబర్ 5వ తేదీన ఏసీ స్లీపర్ టికెట్ రూ.1500 నుంచి రూ.1700 ఉండగాఅదే తేదీన ప్రయివేట్ ట్రావెల్స్‌లో స్లీపర్ టికెట్ ధర రూ.3వేల వరకు ఉంది. ప్రధానంగా దసరా పండుగ నేపథ్యంలో బస్సు టికెట్ ధరలు భారీగా పెరగనున్నాయి. ఓవైపు రైలు టికెట్లు ఖాళీ లేకపోవడం, స్పెషల్ ట్రైన్స్‌లో టికెట్లు మొత్తం బుక్ కావడంతో తప్పకుండా ప్రయాణం చేయాల్సిన వ్యక్తులు బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్సులు పరిమిత సంఖ్యలో ఉండటంతో ఇక ప్రయివేట్ ట్రావెల్స్‌లోనే ప్రయాణం చేయడం అనివార్యం కావడంతో బస్సు టికెట్ ధరలను పెంచినట్లు తెలుస్తోంది.

వరుస సెలవులు కావడంతో..

అక్టోబర్ 2 నుంచి దసరా సెలవులు కావడంతో హైదరాబాద్ నుంచి సొంత ఊర్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈక్రమంలో ట్రైన్, ఆర్టీసీ బస్సుల్లో టికెట్లు ఫుల్ కావడంతో ప్రయివేట్ ట్రావెల్స్ టికెట్ల ధరలను పెంచేశాయి. అక్టోబర్ 15 వరకు పెరిగిన ధరలు అమలులో ఉంటాయని, ఆ తరువాత రద్దీని బట్టి టికెట్ ధరల్లో హెచ్చు తగ్గులు ఉండే అవకాశం ఉంది.

హైడ్రా కార్యాలయం ఉన్నదే ఎఫ్ టిఎల్ లోనే

- జిహెచ్ఎంసి కార్యాలయం, సచివాలయం కూడా ఎఫ్ టిఎల్ పరిధిలోనే ..

–కూలిస్తే ముందు వాటిని కూల్చాలి: బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్): కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్ లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో చెరువులకు హద్దులు గుర్తించాలన్న స్పృహ 60 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ఎందుకు రాలేదని ఆయన నిలదీశారు. ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్ టిఎల్) నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అసలు ఈ ప్రభుత్వానికి ఏవైనా ప్రాధాన్యతలు ఉన్నాయా? అన్నారు. మూసీపై రూ. 1.50 లక్షల కోట్లు కేటాయిస్తారా? అని సీరియస్ అయ్యారు. 2400 కిలోమీటర్ల గంగా నదికే కేవలం రూ. 40 వేల కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్(హైడ్రా) కార్యాలయం ఉన్నదే ఎఫ్ టిఎల్ లోనే అన్నారు. కూలిస్తే ముందు దాన్ని కూల్చాలన్నారు. జిహెచ్ఎంసి కార్యాలయం, సచివాలయం కూడా ఎఫ్ టిఎల్ పరిధిలోనే ఉన్నాయన్నారు. ఎవరి కమీషన్ల కోసం మూసీ సుందరీకరణ అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల సంగతి ఏమిటని నిలదీశారు. ఇప్పటి వరకు రూ. 4 వేల ఆసరా పింఛన్లు ఇవ్వడం లేదు. ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం లేదు. ప్రజలు తిరగబడితే మంత్రులు గ్రామాల్లో తిరగగలరా? అని ప్రశ్నించారు. ఇదిలావుండగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకం (లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్) అన్నారు.

అనువాదం లేకుండా విశ్వ విజ్ఞాన విస్తరణ అసాధ్యం - కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 30:ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు, విజ్ఞాన బంధాగారాలు, ప్రజల అభిప్రాయాలు, సమకాలీన అంశాలు లాంటి అధ్యయన విశేషాలను అన్ని భాషల మానవాళికి అందిస్తున్న మాధ్యమంగా అనువాద ప్రక్రియ ఉపయోగపడుతున్నదని లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షులు కెప్టెన్: డా: బుర్ర మధుసూదన్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి హితబోధ చేశారు. సెప్టెంబర్ 30, 2024న అంతర్జాతీయ అనువాద దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని దన్గర్‌వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో లీడ్ ఇండియా – 2047 నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ వివిధ దేశాల్లో, వివిధ భాషలకు చెందిన పరిశోధనలు, అధ్యయనాలను మనదైన మాతృభాషలోకి తేవడానికి అనువాదం ఉపకరిస్తున్నదని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏడు వేలకు పైగా భాషలు, ఇండియాలోనే 1,600లకు పైగా భాషలు ఉన్నాయని, ఆయా భాషల్లో దాగిన జ్ఞానాన్ని అన్ని భాషల్లోకి అందుబాటులోకి తేవడంలో ప్రధాన భూమిక అనువాదానికి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా బాధ్యులు తుమ్మల రమేశ్ రెడ్డి మాట్లాడుతూ మన మీద మనకు నమ్మకం ఉండాలని, స్పష్టమైన లక్ష్యం ఏర్పరచుకుంటేనే లక్ష్యసాధన సుసాధ్యం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా తెలుగులో వర్ణించిన ఒక కథను ఆంగ్లంలోకి అనువాదం చేసే పోటీలను నిర్వహించి విజేతలైన నలుగురు విద్యార్థినీవిద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రమోద, ఉపాధ్యాయినులు, పదవ తరగతి విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

భారతీయ సినిమా శిఖరాగ్రానికి చేరుకోవాలనే తాపత్రయం, పట్టుదల, కలల సాధనే మిథున్ దా ప్రయాణం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: ప్రఖ్యాత నటుడు శ్రీ మిథున్ చక్రవర్తికి 2022వ సంవత్సరానికి గానూ దాదాసాహేబ్ ఫాల్కే జీవన సాఫల్య పురస్కారం లభించింది. భారతీయ సినిమాకు ఆయన అందించిన చిరస్మరణీయ సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని కేంద్ర సమాచార, ప్రసార, రైల్వే, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈవేళ ప్రకటించారు. బహుముఖ ప్రదర్శనలు, తెరపై ఆకర్షణీయమైన నటనకు పేరొందిన చలనచిత్ర పరిశ్రమలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన, దిగ్గజ వ్యక్తులలో ఒకరిని సత్కరించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇది గర్వంగా ఉందని పేర్కొన్నారు.

మిథున్ దా చిరస్మరణీయ ప్రయాణం

మిథున్ దా గా గుర్తింపు పొందిన మిథున్ చక్రవర్తి దిగ్గజ భారతీయ నటుడు, నిర్మాత, రాజకీయ నాయకుడు. బహుముఖ పాత్రలు, విలక్షణమైన నృత్య శైలితో ఆయన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తన సినిమాల్లో ఆయన విభిన్నమైన పాత్రలు పోషించారు. నాటకీయ ప్రదర్శనల్లో, యాక్షన్ నిండిన పాత్రల్లో కనిపించారు.

యువకుడిగా నిరాడంబర అరంగేట్రం నుంచి దిగ్గజ సినీనటుడి వరకు మిథున్ చక్రవర్తి ప్రయాణం సాగిందని మంత్రి పేర్కొన్నారు. ఆయన ప్రయాణంలో ఆశ, పట్టుదలతో కూడిన స్ఫూర్తి కనిపిస్తుందని, అభిరుచి, అంకితభావంతో అత్యంత ప్రతిష్టాత్మక కలలను సైతం సాధించవచ్చని ఆయన రుజువు చేశారని అన్నారు. ఆయన అంకితభావం, కఠోర శ్రమ ఔత్సాహిక నటులు, కళాకారులకు ఆయనను ఆదర్శనీయుడిని చేసిందని పేర్కొన్నారు.

మిథున్ దా అసలు పేరు గౌరంగ్ చక్రవర్తి. 1950 జూన్ 16న పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో జన్మించారు. తన మొదటి సినిమా "మృగయా"(1976)తోనే ఆయన ఉత్తమ నటుడిగా జాతీయ చలనచిత్ర అవార్డును గెలుచుకున్నారు. ప్రతిష్టాత్మక ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) పూర్వ విద్యార్థి అయిన మిథున్ చక్రవర్తి తన కళా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకొని, సినిమాల్లో భవిష్యత్తుకు పునాది వేసుకున్నారు.

మృణాల్ సేన్ సినిమాలో సంతాల్ తిరుగుబాటుదారు పాత్ర ఆయనకు జాతీయ స్థాయిలో ఖ్యాతిని తీసుకొచ్చింది. "డిస్కో డాన్సర్"(1982) సినిమాలో తన పాత్రతో 1980లలో మిథున్ గణనీయమైన ప్రాచుర్యాన్ని సంపాదించుకున్నారు. భారత్‌లోనే కాకుండా అంతర్జాతీయంగా భారీ విజయాన్ని అందుకున్న ఈ సినిమా ఆయనను నృత్య సంచలనంగా మార్చింది. "డిస్కో డాన్సర్"(1982) సినిమాలో తన పాత్రతో ఆయన అందరికీ తెలిసిన నటుడిగా మారిపోయారు. ఆయన అసాధారణమైన నృత్య నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు భారతీయ చలన చిత్ర రంగంలో డిస్కో సంగీతానికి ఈ సినిమా ప్రాచుర్యం తెచ్చింది. అగ్నిపథ్ సినిమాలో తన నటనతో ఆయన 1990లో ఉత్తమ సహాయ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారాన్ని గెలుచుకున్నారు.

అనంతరం తహదేర్ కథ(1992), స్వామి వివేకానంద(1998)లో తన పాత్రలకు గానూ మరో రెండు జాతీయ చలనచిత్ర పురస్కారాలను కైవసం చేసుకున్నారు. తన సుదీర్ఘ కెరీర్‌లో హిందీ, బెంగాలి, ఒడియా, భోజ్‌పురి, తెలుగు సహా వివిధ భారతీయ భాషల్లో 350కి పైగా చిత్రాల్లో మిథున్ నటించారు. యాక్షన్ నుంచి డ్రామా, కామెడీ వరకు విభిన్న ప్రదర్శనలకు ఆయన గుర్తింపు పొంది ఉత్తమ నటుడిగా మూడు జాతీయ చలనచిత్ర పురస్కారాలతో పాటు అనేక పురస్కారాలను గెలుచుకున్నారు.

మిథున్ దా మరో కీర్తి

మిథున్ దా కేవలం తన చలనచిత్ర విజయాలకే కాకుండా సామాజిక అంశాల పట్ల ఆయన అంకితభావానికి సైతం గుర్తింపు తెచ్చుకున్నారని కేంద్రమంత్రి పేర్కొన్నారు. విద్య, వైద్యసేవలు, అణగారిన వర్గాలకు సాయం చేసే లక్ష్యంతో వివిధ సేవా కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారని, సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆయన నిబద్ధతను ఇది చాటుతోందని అన్నారు.

పార్లమెంటు సభ్యుడిగా ఆయన పని చేయడం ప్రజాసేవ, పరిపాలన పట్ల తన అంకితభావాన్ని చూపుతోందని పేర్కొన్నారు.

దాదాపు ఐదు దశాబ్దాల వృత్తి జీవితం మొత్తంలో మిథున్ చక్రవర్తి లెక్కకు మించిన అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. భారతీయ చలనచిత్రానికి విశేష సేవలు అందించి గుర్తింపు పొందారు. ఇందుకు గానూ ఇటీవలే ఆయనకు ప్రతిష్టాత్మక పద్మ భూషణ్ పురస్కారం సైతం లభించింది. డిస్కో డాన్సర్, ఘర్ ఏక్ మందిర్ వంటి అద్భుత చిత్రాలతో కూడిన తన చలనచిత్ర జీవితంలో ఆయన కోట్లాది మందికి వినోదాన్ని అందించడంతో పాటు బాలీవుడ్, ప్రాంతీయ సినిమాకు ఒక రూపం తీసుకొచ్చారు. ఆయన ప్రభావం కేవలం వెండితెరకు మాత్రమే పరిమితం కాలేదు. చలనచిత్రాలతో పాటు దాతృత్వంలోనూ ఆయన భావి తరాల్లో స్ఫూర్తి నింపుతున్నారు.

వచ్చే నెల 8న జరగనున్న 70వ జాతీయ చలనచిత్ర పురస్కారాల వేడుక సందర్భంగా ఆయనకు ఈ పురస్కారాన్ని అందిస్తారు. దాదాసాహేబ్ ఫాల్కే పురస్కార ఎంపిక కమిటీలో సభ్యులుగా ఉన్న వారు:

ప్రతిష్టాత్మక దాదాసాహేబ్ ఫాల్కే జీవనసాఫల్య పురస్కారం కేవలం మిథున్ చక్రవర్తి కళాత్మక గొప్పతనాన్నిమాత్రమే కాదు, అనేక మంది జీవితాల్లో మార్పు తెచ్చిన కరుణ, అంకితభావం గల వ్యక్తిగా ఆయన ఘనతకు సైతం దక్కిన గుర్తింపు.

మూసీ సుందరీకరిస్తే ఎవరి బతుకులు బాగుపడతాయి..

–సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 30:కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు అతీగతీ లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. 1.5 లక్షల కోట్లు పెట్టి మూసీ సుందరీకరణ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని.. దీనికోసం 25 వేల ఇండ్లు కూల్చేందుకు సిద్ధమయ్యారని అన్నారు. ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆటో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మికులకు ఖాకీ యూనిఫాంలను హరీశ్‌రావు అందజేశారు.

అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా అక్కడ నివసిస్తున్న ప్రజల ఇండ్లు కూల్చేస్తుండటంతో ప్రజలు కన్నీరు మున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి గుండె కరగడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేల కుటుంబాలను ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. పేదల బతుకు ముఖ్యమా.. సుందరీకరణ ముఖ్యమా అని ప్రశ్నించారు. సీఎం నిర్ణయంతో లక్షల మంది రోడ్డున పడే పరిస్థితి వహైడ్రా పేరిట చేస్తున్న డ్రామాలను ఆపేయాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు హితవు పలికారు. రేవంత్ రెడ్డికి కూల్చడం తప్ప నిర్మించడం రాదని ఎద్దేవా చేశారు. మూసీని సుందరీకరిస్తే ఎవరి బతుకులు బాగుపడతాయని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ, హైడ్రా కాదు.. ముందు గ్రామాల్లో అభివృద్ధి చూడాలని హితవు పలికారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 56 మంది ఆటో కార్మికులు చనిపోతే ఒక్క కుటుంబాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పరామర్శించలేదని హరీశ్ రావు అన్నారు. ఒక్క కుటుంబాన్ని కూడా ఆదుకోలేదని పేర్కొన్నారు. ఎన్నికల ముందు చెప్పిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటివరకు ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని అన్నారు. రైతుబంధు ఏమైంది కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఏమైంది నిరుద్యోగ భృతి ఏమైంది అని ప్రశ్నించారు.

రుణమాఫీ సంగతేంటని నిలదీశారు. సగం మందికి కూడా రుణమాఫీ కాలేదు.. కానీ అందరికీ రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్నారని మండిపడ్డారు.

సిద్దిపేట ఆటో సొసైటీ దేశానికే ఆదర్శమని హరీశ్‌రావు కొనియాడారు. ఈ సొసైటీ కింద ఆటో డ్రైవర్లకు 2 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తున్నామని.. ఆర్థిక అవసరాలు ఉన్న వారికి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు సొసైటీ కింద రూ.2.10 కోట్ల రుణాలను ఇచ్చామని తెలిపారు. 26 మంది ఆటో కార్మికులు చనిపోతే వారి కుటుంబాలకు 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇచ్చామని పేర్కొన్నారు. మద్యం, గుట్కా అలవాట్లను మానుకోవాలని, కుటుంబాలను బాగా చూసుకోవాలని ఆటో డ్రైవర్లకు హరీశ్‌రావు సూచించారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి మరీ ఆటో డ్రైవర్లకు న్యాయం జరిగే విధంగా కొట్లాడతానని తెలిపారు. సిద్దిపేట ఆటో కార్మికుల కోసం పెట్రోల్ బంక్ మంజూరు చేయిస్తానని చెప్పారు.

వాహనాల దొంగల అరెస్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 30: ద్విచక్ర వాహనాల దొంగలను చిలకలగూడ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.10లక్షల విలువ చేసే 18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వివరాల వెల్లడించారు.

కామారెడ్డికి చెందిన శ్రీనివాస్ 15 ఏండ్ల కిందట నగరానికి వచ్చాడు. 2020లో కొవిడ్‌తో అతడి భార్య మరణించింది. దీంతో 2022లో మరో పెండ్లి చేసుకున్నాడు. మూడు నెలలకే ఆమెను వదిలిపెట్టి.. మద్యం, గంజాయికి బానిసయ్యాడు. డబ్బుల కోసం దొంగతనాలు మొదలుపెట్టాడు. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, మెదక్ ప్రభుత్వ ఆస్పత్రులు, మెట్రో స్టేషన్ల వద్ద బైక్‌లను దొంగిలించాడు.

చోరీ చేసిన వాహనాలను చర్లపల్లికి చెందిన ఏసు రత్నం(38), శాంతారావు(28), దమ్మాయిగూడకు చెందిన శ్రీను(32) కు విక్రయించాడు. బాధితుల ఫిర్యాదులతో కేసు నమోదు చేసుకున్న చిలకలగూడ పోలీసులు.. చాకచక్యంగా నలుగురిని పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.10లక్షల విలువ చేసే 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో చిలకలగూడ అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌తో పాటు ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో యువకుడు దారుణహత్య..

నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 30: : జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో అర్ధరాత్రి ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన జరిగింది. స్థానిక గుడిపాటిగడ్డలో ఉప్పరిపేట నివాసి మనోహర్ ను ఇవాళ తెల్లవారుజామున దారుణంగా కొట్టి, కత్తితో పొడవడంతో అక్కడికక్కడే మరణించాడని పోలీసులు తెలుపుతున్నారు.

అనంతరం నిందితుడు దుర్గాప్రసాద్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమా ?.. లేక మరి ఏదైనా నా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అందుబాటులో మరో 2.50 లక్షల అమెరికా వీసాలు..

అమెరికా వెళ్లాలని అనుకునే భారతీయులకు అగ్రరాజ్యం మరో గుడ్ న్యూస్ చెప్పింది. అదనంగా 2.5 లక్షల వీసా అపాయింట్‌మెంట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపింది. పర్యటకులు, నైపుణ్యం కలిగిన కార్మికులతో పాటు స్టూడెంట్స్ కు ఇవి దోహదం చేస్తాయని చెప్పుకొచ్చింది. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటనను రిలీజ్ చేసింది.కాగా, తాజాగా రిలీజ్ చేసిన స్లాట్‌ల వల్ల వేలాది మంది భారతీయులు సకాలంలో ఇంటర్వ్యూలు పొందడానికి హెల్ప్ చేస్తుందని అమెరికా రాయబార కార్యాలయం చెప్పుకొచ్చింది. అంతేకాకుండా అమెరికా– భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రయాణాన్ని సులభతరం చేస్తుందని తెలిపింది. వరుసగా రెండో ఏడాది కూడా పది లక్షలకు పైగా నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా అపాయింట్‌మెంట్లను యూఎస్ ఎంబసీ చేపట్టింది. ప్రస్తుతం కుటుంబీకులు, బిజినెస్, పర్యటకులపై అమెరికా దృష్టి సారించింది.

అలాగే, గతేడాది మాదిరిగానే ఈసారి కూడా భారీ సంఖ్యలో విద్యార్థి వీసాలు జారీ చేయబోతున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం చెప్పుకొచ్చింది. అయితే, ఇప్పటి వరకు ఎన్ని జారీ చేసిందనే విషయంపై యూఎస్ ఎంబసీ క్లారిటీ ఇవ్వలేదు. 2023లో మాత్రం 1.4 లక్షల మంది ఇండియన్ స్టూడెంట్స్ కు వీసాలు ఇచ్చింది అమెరికా.

మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే బోజ్జు పటేల్..

ఆదిలాబాద్, సెప్టెంబర్ 30: ఆదిలాబాద్ జిల్లా అందోల్ ఎక్స్ రోడ్ సైనికంలో ఇవాళ బైక్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని అంబులెన్స్ లోకి ఎక్కించి చికిత్సల కోసం పంపించి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బోజ్జు పటేల్ మానవత్వాన్ని చాటుకున్నారు.

ఎమ్మెల్యే ఇస్లాపూర్ వెళ్తుండగా మార్గమధ్యంలో యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఉండగా, తన వాహనాన్ని ఆపి అంబులెన్స్ కు సమాచారం ఇచ్చి వైద్య చికిత్స నిమిత్తం అంబులెన్స్ లో యువకులతో ఎక్కించి పంపించారు.

ఎమ్మెల్యే మానవత్వాన్ని చాటుకోవడం ఎంతో సంతోషకరమని పలువురు అన్నారు. ఒక హోదా గల వ్యక్తి వాహనాన్ని ఆపి వైద్య చికిత్సలకు పంపించడం సంతోషకరమని పలువురు అన్నారు.

తిరుమలలో లడ్డూ గోదాములను పరిశీలించిన సిట్ బృందం

తిరుపతి, సెప్టెంబర్ 30: తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది. మూడో రోజు దర్యాప్తులో భాగంగా తిరుమల లోని గోదాములు, పరిశోధనశాలలో పర్యటించారు. గోదాములకువచ్చిన ట్యాంకర్ల నుంచి నెయ్యి నమూనాలు సేకరించారు. ల్యాబ్‌లో నాణ్యత పరీక్షల యంత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోదాముల్లో ముడిసరుకుల నాణ్యతను పరిశీలించారు. పిండి మర ప్రయోగశాలను సిట్ సభ్యులు పరిశీలించారు. శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి అంశంపై లోతైన విచారణ చేస్తామని సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు . తిరుపతి తూర్పు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు సిట్‌కు బదిలీ అయ్యిందని వెల్లడించారు. నెయ్యి సరఫరా చేసిన ఏఆర్ డెయిరీపై విచారణ జరుపుతామని పేర్కొన్నారు. కల్తీ నెయ్యికి బాధ్యులైన అందరినీ విచారిస్తామని చెప్పారు. నివేదిక సమర్పించడానికి ఎలాంటి కాలపరిమితి లేదని అన్నారు. సిట్ బృందంలో డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అదనపు ఎస్పీ వెంకటరావు నేతృత్వంలో దర్యాప్తును కొనసాగిస్తున్నారు. శనివారం తిరుమలకు చేరుకున్న సిట్ సభ్యులు శ్రీవారిని దర్శించుకున్న అనంతరం లడ్డూలను తయారి చేసే పోటును సందర్శించారు.

ఆహ్వానము

జి.వి.ఆర్ కల్చరల్ ఫౌండేషన్

ప్రపంచరికార్డులు నెలకొల్పిన శ్రీ త్యాగరాయ గానసభ

శ్రీ పాత్తూరి సుబ్బారావు రచించిన పన్నెండవ పుస్తకం 'సుప్రభాత భావనలు' (వ్యాసాలు) ఆవిష్కరణ-

శ్రీ పెద్దూరి వెంకటదాసుకి అంకితం

ముఖ్యఅతిథి : డా॥కె.వి.రమణాచారి ఐ.ఎ.ఎస్.(ర)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు

సభాధ్యక్షులు : శ్రీ రమణ వెలమకన్ని
కవి,రచయిత, విమర్శకులు

విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్.జనార్దనమూర్తి
అధ్యక్షులు శ్రీ త్యాగరాయ గానసభ

సభాప్రారంభకులు : శ్రీ బైసదేవదాసు
సంపాదకులు, నేటినిజం దినపత్రిక

ఆత్మీయ అతిథి : డా॥వై.రామకృష్ణారావు
సాహితీవేత్త

అతిథి సత్కారం : శ్రీ పి.వి.ఎల్.నరసింహారావు
సాహిత్యాభిమాని

సభానిర్వహణ : శ్రీమతి పాత్తూరి జయలక్ష్మి
మేనేజర్, సాహితీకిరణం

కవిసమ్మేళనం నిర్వహణ : డా॥పి.లలితవాణి
సాహితీవేత్త

'విజయీభవ' అనే అంశంపై కవి సమ్మేళనం

పాల్గొనే కవులు, కవయిత్రులు
శ్రీతంగిరాల చక్రవర్తి, శ

గోగిరెడ్డి అంజనీదేవికి డాక్టరేట్ ప్రదానం

హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్)బి;ప్రముఖ సంఘ సేవకురాలు గోగిరెడ్డి అంజనీదేవికి స్ఫూర్తి సొసైటీ ఆ ర్గనైజే షన్ వారు చేసే సంఘ సేవ ను గుర్తించి డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగింది.అలాగే ఆమె యుక్క సేవా దృక్పదాన్ని గుర్తించి భారతీయ నారీ శక్తి ఇంటర్ నేషనల్ అవార్డ్ ను కుడా ప్రధానం చేయడం జరిగింది తెలంగాణా సారస్వత పరిషత్ లో ఆమెకు ఈ అవార్డులను ప్రదానం చేసారు.

తన సేవలను గుర్తించిన స్ఫూర్తి సొసైటీ ఆర్గనైజే షన్ చైర్మన్ ఆకుల రమేష్ కు ధన్యవాదాలు తెలిపారు. మునుముందు మరిన్ని సేవాకార్యక్రమాలను నిర్వహిస్తూ త్రాజల్లకు మరింత దగ్గర అవగాలననే వుత్సాహాన్ని అంజనీదేవి వ్యక్తం చేసారు.

పేదల ఇండ్లు కూల్చడంలో ఉన్న శ్రద్ధ మాపై లేదా.. హన్మకొండలో విద్యార్థుల ఆందోళన

హన్మకొండ, సెప్టెంబర్ 30: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్ మెంట్, ఇతర సమస్యలపై ఓరుగల్లు విద్యార్థులు నడుం బిగించారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని హన్మకొండ ఏకశిలా పార్క్ వద్ద ధర్నాకు దిగారు. ముఖ్యమంత్రి గారు.. మా విద్యా శాఖ మంత్రి ఎవరు.. మా విద్యార్థుల సమస్యలు కనిపించడం లేదా అంటూ రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తూ నిరసనలు తెలిపారు.

పేదల ఇండ్లు కూలగొట్టడంలో ఉన్న శ్రద్ధ.. మా స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంలో లేదా అంటూ సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విద్యార్థులు ప్రశ్నించారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని హన్మకొండ కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు యత్నించారు.

దసరాకు ఆరు వేల ప్రత్యేక బస్సులు ..

-హైదరాబాద్ శివారు నుంచి వివిధ ప్రాంతాలకు సర్వీస్ లు
-ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు బస్సులు
-కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లో ఎలక్ట్రిక్ బస్సులు
-టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 30: ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ప్రయాణికుల సమయాభావం తగ్గించేందుకు హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి దసరాకు ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. సొంతూళ్లకు వెళ్లే వారి కోసం ఎంజీబీఎస్, జేబీఎస్, ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, సంతోష్ నగర్, కేపీహెచ్‌బీ, తదితర ప్రాంతాల నుంచి స్పెషల్ సర్వీసులను అందుబాటులో ఉంచనుంది. ఐటీ కారిడార్ ఉద్యోగుల సౌకర్యార్థం గచ్చిబౌలి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు, తదితర ప్రాంతాలకు బస్సులను నడిపేలా ప్లాన్ చేసింది.

దసరా పండుగకు ప్రత్యేక బస్సులు, రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై తమ క్షేత్ర స్థాయి అధికారులతో టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ వర్చువల్‌గా సమావేశమయ్యారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్టీసీ ఉద్యోగుల కృషి అభినందనీయమన్నారు. గత దసరాతో పోల్చితే ఈ సారి మహాలక్ష్మి పథకం అమలు వల్ల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముందని, గతంలో మాదిరిగానే ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రద్దీని బట్టి ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు.

బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఈ పండుగలకు 6 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 15వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఈ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించారు.

అక్టోబర్ 12న దసరా పండుగ ఉన్నందున.. 9, 10, 11 తేదిల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముందని, ఆయా రోజుల్లో అవసరాలకు అనుగుణంగా మరిన్నీ ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. రద్దీ రోజుల్లో ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మాట్లాడి ఆర్టీసీ బస్సులకు టోల్ ప్లాజా వద్ద ప్రత్యేక లేన్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్ నగర్, తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కూర్చీలు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ దసరాకు కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లో కాలుష్యరహిత కొత్త ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులను వినియోగించుకోవాలన్నారు. "గత దసరాతో పోల్చితే ఈసారి మహాలక్ష్మి పథకం అమలుతో పాటు అక్టోబర్ నెలలో 11 శుభముహూర్తాలు కూడా ఉన్నాయి. ఆ రద్దీకి తగ్గట్టు బస్సులను నడపాలని సంస్థ ముందుగానే ప్లాన్ చేసింది. ఈ సారి అందుకే బతుకమ్మ, దసరా పండుగలకు 6 వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక సర్వీసులను ఉపయోగించుకుని క్షేమంగా, సురక్షితంగా ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతున్నాం." అని టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనర్ అన్నారు.పోలీస్, రవాణా, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా సంస్థ అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ టీజీఎస్ఆర్టీసీ సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్ ను సంస్థ అధికారిక వెబ్ సైట్ gsrtbus.inలో చేసుకోవాలని సూచించారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం తమ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ అవినీతి పార్టీలే

-కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్ రూ.లక్ష కోట్ల అవినీతి..
-మూసీ పేరుతో కాంగ్రెస్ రూ.లక్షణ్నర కోట్ల దోపిడీ ..
-హైడ్రాను ప్రజలు అసహ్యించుకుంటున్నారు - కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్, సెప్టెంబర్ 30: కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు అవినీతి పార్టీలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు.

సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కాలేశ్వరం ప్రాజెక్టు పేరిట లక్ష కోట్ల ప్రజాధనం దోచుకుంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ ను మించి మూసి పేరిట లక్షన్నర కోట్ల దోపిడీకి సిద్ధమైనదన్నారు.

మూసీ ప్రక్షాళన పేరుతో అప్పు తెచ్చి దోచుకునేందుకు సిద్ధమయ్యారన్నారు. హైడ్రా తీరుతో ప్రజలు అసహ్యించుకుంటున్నారని,ఇదేనా ఇందిరమ్మ పాలన అని ప్రశ్నించారు.ప్రజలకు నిలువ నీడ లేకుండా చేయడమే ఇందిరమ్మ పాలనా అని ఎద్దేవా చేశారు.అయ్యప్ప సొసైటీ కూల్చివేత పేరుతో బీఆర్ఎస్ వసూళ్లకు పాల్పడిందని,హైడ్రా పేరుతో కాంగ్రెస్ వసూళ్లకు తెర తీసిందన్నారు. పేదల ఇండ్లను కూలిస్తే హైడ్రాను అడ్డుకుంటామని,ప్రజలకు బీజేపీ ఆయుధం కాబోతోందన్నారు.

ప్రజలకు మా ప్రాణాలను అడ్డుపెడతామని,మా ప్రాణాలు తీశాకే ప్రజల ఇండ్లపై దాడులకు వెళ్లాలన్నారు. హైడ్రా దాడులపై బీజేపీ సింగిల్ గానే ఉద్యమిస్తుందన్నారు.

కుటుంబ వారసత్వ పార్టీలంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని, తమిళనాడులో తండ్రి సీఎం, కొడుకు డిప్యూటీ సీఎం ఉండటం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే సహా కుటుంబ పార్టీల్లో కార్యకర్తలకు ముఖ్య పదవులు ఇచ్చే సంస్కృతి లేదన్నారు. కుటుంబ, వారసత్వ పార్టీలను బొంద పెట్టాలని పిలుపునిచ్చారు.

ప్రజావాణి కార్యక్రమంలో 60 దరఖాస్తులు

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.

సంగారెడ్డి, సెప్టెంబర్ 30: (నేటినిజం ప్రతినిధి): జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల తో పాటు పెండింగ్ ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశించారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 60 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ప్రజావాణి అనంతరం జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణి దరఖాస్తులను స్వీకరిచడం తో పాటు, పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికారులు తక్షణ చర్యలుతీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కారం చూపి,ఆన్లైన్లో అప్డేట్ చేయాలని అన్నారు.

అలాగే ప్రత్యేక అధికారులు ప్రతి నెలా సమర్పించే ముందస్తు టూర్ డైరీలను సకాలంలో సమర్పించాలని సూచించారు. ఈ టూర్ డైరీ ప్రకారం ప్రతిరోజు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గ్రామాల్లో శానిటేషన్ సమస్యల పరిష్కారానికి, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు వేగంగా పరిష్కారం చూపి,ఆన్లైన్లో అప్డేట్ చేయాలని అన్నారు.

అలాగే ప్రత్యేక అధికారులు ప్రతి నెలా సమర్పించే ముందస్తు టూర్ డైరీలను సకాలంలో సమర్పించాలని సూచించారు. ఈ టూర్ డైరీ ప్రకారం ప్రతిరోజు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీరాజ్ శాఖ ఏఈలు, జిపి సెక్రెటరీలు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ముఖ్యం గా కె జిబివి పాఠశాలలు, గురుకులాలు , సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అక్కడ చదువుకుంటున్న విద్యార్థుల మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాలని, త్రాగునీటి సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

వసతి గృహాల్లో త్రాగునీటి సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ప్రజావాణి దరఖాస్తుల విషయానికి వస్తే, రెవెన్యూ శాఖ 30, దరఖాస్తులు, సర్వే ల్యాండ్ రికార్డు 5, పౌరసరఫరాల శాఖ 2, పంచాయతీరాజ్ ఉ పి టి విభాగం 7, పురపాలక శాఖ 5, జిల్లా సంక్షేమ శాఖ 4, విద్యాశాఖ 1, వ్యవసాయ శాఖ నుంచి 3, వైద్య ఆరోగ్య శాఖ 1, ఎక్సైజ్ శాఖ 2 , ధరఖాస్తులు అందాయని తెలిపారు తెలిపారు.

అన్ని దరఖాస్తులను సత్వరమే పరిశీలించి, సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

అక్టోబర్ 3 నుండి 5 వరకు జి-స్పార్క్ 2024 గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్

హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అక్టోబర్ 3 నుండి 5 వరకు హైదరాబాద్ నగరంలో జి-స్పార్క్ 2024 గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్ ను నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ అధ్యక్షుడు మరియు జి-స్పార్క్ చైర్‌మెన్ డాక్టర్ రంగారెడ్డి బుర్రి, కో-చైర్, ఆర్. గోవింద్ హరి తెలిపారు.సోమవారం హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో వారు మాట్లాడుతూ నగరంలోని మాదాపూర్‌లోని హైటెక్‌సిటీలోని శిల్పకళా వేదికలో అక్టోబరు 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సు తెలంగాణా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరాయి ప్రారంబిస్తారని వారు తెలిపారు..అలాగే ఈ సదస్సుక గౌరవ అతిథిగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహ హాజరుకానున్నారు.ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర యాంటీమైక్రోబయల్ రెసిస్టన్స్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి ప్రకటించనున్నారు. భారతదేశంలో కేవలం ఆరు రాష్ట్రాలు ఈ ప్రణాళికను కలిగి ఉన్నాయి మరియు ఈ ప్రణాళిక ప్రారంభించిన తర్వాత తెలంగాణ భారతదేశంలో 7వ రాష్ట్రంగా అవతరిస్తుంది. శ్రీ రేవంత్ రెడ్డి సదస్సును ప్రారంభించి, రాష్ట్ర యాంటీమైక్రోబయల్ రెసిస్టన్స్ ప్లాన్‌ను ప్రారంభిస్తారు. భారతదేశం లోని ఆరు రాష్ట్రాలు ఈ ప్రణాళికను అమలు చేస్తున్నాయి మరియు ముఖ్యమంత్రి రాష్ట్ర కార్యాచరణ ను ప్రకటించిన తర్వాత భారతదేశంలో ఏఎంఆర్ ప్రణాళికను కలిగి ఉన్న 7వ రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుంది .కాన్ఫరెన్స్ యొక్క లక్ష్యం, వారి ప్రకారం, ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ (ఎఇఅ), యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) మరియు గ్లోబల్ సౌత్ (ఆసియా, ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, సౌత్‌లోని వనరుల-పరిమిత దేశాలు) నుండి పేషెంట్ సేఫ్టీ వాటాదారులకు ఒక వేదికను అందించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం. ఎఇఅ, ఎటీమె మరియు చియాఉ (నీరు, పారిశుద్ధ్యం మరియు పరిశుభ్రత) మరియు కోవిడ్ లాంటి మహమ్మారి సంసిద్ధతపై మెరుగైన విధానాలు, పరిశోధన, అనుకూల పరిష్కారాలు మరియు అభ్యాసాల కోసం సహకరించడానికి తోడ్పడుతుంది.యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) అన్ని వయసుల ప్రజలను ప్రభావితం చేస్తుందని మరియు సరిహద్దులను దాటి, ప్రతి దేశాన్ని ప్రభావితం చేస్తుందని నిర్వాహకులు హైలైట్ చేశారు. అయినప్పటికీ, అభివృద్ధి చెందుతున్న దేశాలు మరియు హాని కలిగించే జనాభాపై భారం అసమానంగా ఎక్కువగా ఉంటుంది. ఇది గ్లోబల్ సౌత్ ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్లను పరిష్కరించడానికి తగిన పరిష్కారాలు అవసరం. అందువల్ల, ఏఎంఆర్ వంటి ప్రపంచ ఆరోగ్య ప్రమాదాలను ఎదుర్కోవడంలో సహకార ప్రయత్నాలు మరియు దక్షిణ-దక్షిణ సహకారం అవసరం.అని తెలిపారు.జి-స్పార్క్ 2024 ను ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ ఆఫ్ ఇండియా (ఎఇఅంఎ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రగ్యాన్ సస్టైనబుల్ హెల్త్ అవుట్‌కమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వందమందికి పైగా అకాడెమియా, పరిశ్రమలు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు మరియు ప్రొఫెషనల్ పార్టనర్‌ల మద్దతుతో నిర్వహిస్తోంది.రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టిసిసిఐలో డాక్టర్ రంగారెడ్డి విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ, 'ఏఎంఆర్‌తో పోలిస్తే కోవిడ్ ఏమీ లేదన్నారు. కోవిడ్‌కి ప్రారంభం మరియు ముగింపు ఉన్నాయి. ఎఎఖీ అలా కాదు. ఇది నెమ్మదిగా వచ్చే మహమ్మారి మరియు ఇది శాశ్వతమైన మహమ్మారి అని ఆయన తెలిపారు. జి-స్పార్క్ 2024 హాజరయ్యే నిపుణులు ఈ అనేక ఇతర విషయాలను చర్చిస్తారని ఆయన తెలిపారు

ఆహ్వానం
తెలంగాణ రచయితల సంఘం
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో...
వార్షిక సాహిత్య సభలు
6, అక్టోబర్, 2024, ఉ.10.30 నుంచి సా.5.30 వరకు, రవీంద్రభారతి సమావేశ మందిరం
ప్రారంభ సమావేశం
ఉ.10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు
స్వాగతం : శ్రీ ఘనపురం దేవేందర్
అధ్యక్షులు : డా. నాళేశ్వరం శంకరం
ప్రారంభోపన్యాసం : డా.పరాంకుశం వేణుగోపాల స్వామి
ఆత్మీయ అతిథులు : డా.సందిని సిధారెడ్డి, శ్రీ దేశపతి శ్రీనివాస్, ఆచార్య సూర్యా ధనుంజయ, శ్రీ కందుకూరి శ్రీరాములు
కార్యదర్శి నివేదిక : డా.వి.శంకర్
వందన సమర్పణ : శ్రీ కొత్త అనిల్ కుమార్
మధ్యాహ్న భోజనం - 1 గం. నుంచి 2 వరకు
సాహిత్య సదస్సు : మ.2. గం.నుంచి 3.30 వరకు
తెలంగాణ అస్తిత్వ సాహిత్యం - వర్తమాన సందర్భం
స్వాగతం : డా.బెల్లంకొండ సంపత్ కుమార్
అధ్యక్షులు : శ్రీ పాట్లపల్లి శ్రీనివాస రావు
వక్తలు
సాహిత్యం : ఆచార్య సి.కాశీం
సంస్కృతి : శ్రీ కొల్లాపురం విమల
భాష : డా.సలిమెల భాస్కర్
వందన సమర్పణ : డా.పొన్నాల బాలయ్య
పుస్తకావిష్కరణలు
మ. 3.30 నుంచి 4.30 వరకు
స్వాగతం : డా.జిడి రమేష్
నిర్వహణ : శ్రీ బిల్లా మహేందర్
ఇల్లు కవితా సంకలనం
ఆవిష్కర్త : శ్రీ బైస దేవదాసు
పచ్చబొట్టు
కవితా సంపుటి కవులు : శ్రీ జి.నరసింహస్వామి, శ్రీ ఘనపురం దేవేందర్, శ్రీ తిరుమల శ్రీనివాస్ ఆర్య, శ్రీ నరాల సుధాకర్
ఆవిష్కర్త : డా. సలిమెల భాస్కర్
వందన సమర్పణ : కవిత
కవిసమ్మేళనం
సా.4.30 నుంచి 5.30 వరకు
స్వాగతం : శ్రీ బి.పలపతి
నిర్వహణ : శ్రీ దాస్యం సేనాధిపతి
వందన సమర్పణ : శ్రీ రుద్రంగి రమేష్
పాల్గొను కవులు
వి.ఆర్. విద్యార్థి, పప్పుల రాజిరెడ్డి, మోతుకూరి అశోక్ కుమార్, తైదల అంజయ్య, కందాళై రాఘవాచార్య, రూప్ కుమార్ దబ్బికార్, నెల్లుట్ల రమాదేవి, దేవనపల్లి వీణావాణి, గడ్డం సులోచన, కవిత, సిద్దంకి యాదగిరి, కలువకుంట రామకృష్ణ, గంబిరావుపేట యాదగిరి, జి.నరసింహ స్వామి, సిహెచ్. ప్రకాష్, దేశపతి కృష్ణమూర్తి, నల్లగొండ రమేష్, నరాల సుధాకర్, గుండెళ్లి ఇస్తాలి, సాంబరాజు యాదగిరి, నక్క సురేష్, యరకల యాదయ్య, దాసరి మోహన్
అందరు ఆహ్వానితులే

ఎన్నికల బాండ్ల కేసులో కేంద్ర మంత్రికి ఊరట.. స్టే ఇచ్చిన హైకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: కర్నాటక హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌పై నమోదు అయిన కేసులో విచారణను అడ్డుకుంటూ కోర్టు స్టే ఇచ్చింది. ఎన్నికల బాండ్ల(ఇ్రీవఇ్ బీనీతీజీ్రీ ఎనీనిటబ)ను కొనాలంటూ కంపెనీలపై మంత్రి సీతారామన్‌తో పాటు మరికొందరు వత్తిళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో ఇవాళ కర్నాటక హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. కేంద్ర మంత్రి సీతారామన్‌తో పాటు బీజేపీ నేతలపై నమోదు అయిన కేసును సీబడీకి అప్పగించాలని బెంగళూరు పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆ కేసులో స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు.. రూ. 37.60 లక్షల గంజాయి పట్టివేత

భద్రచలం, సెప్టెంబర్ 30: ఖమ్మం జిల్లా భద్రచలంలోని కూనవరం ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద ఎక్సైజ్ అధికారులు రూ. 37.60 లక్షల విలువగల గంజాయిని పట్టుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 130.730 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఒరిస్సా నుంచి కర్ణాటకకు కారులో గంజాయిని తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. ముంబాయికి చెందిన యూసఫ్ సహీద్ ఖాన్ అనే గంజాయి స్మగ్లర్ , జహీరాబాద్‌కు చెందిన డ్రైవర్ మహ్మద్ షరీఫ్ తో పాత పరిచయాలున్నాయి.

డ్రైవర్‌గా ఒక్క రోజు విధులు నిర్వహిస్తే రూ. 50 వేలు వస్తాయని యూసఫ్ డ్రైవర్ మహ్మద్ షరీఫ్‌ను నమ్మించాడు. రూ. 2.20 లక్షల నగదు ఒడిస్సాలోని మల్కాన్‌గిరి ప్రాంతానికి వెళ్లి నగదు ఇస్తే వారు ఇచ్చే గంజాయిని తీసుకురావాలని పురామయించి నగదును అందజేశాడు. అక్కడి నుంచి వారిచ్చె గంజాయిని కారులో తీసుకువచ్చి కర్ణాటకలోని హుమ్నాబాద్ లో అప్పగించాలని మాట్లాడుకున్నారు. షరీఫ్ మల్కాన్‌గిరికి వెళ్లి 130.730 కిలోల గంజాయిని తీసుకొని తిరుగు ప్రయాణమయ్యడు.

ఈ సమాచారాన్ని అందుకున్న ఏఈఎస్ తిరుపతి, ఎస్టీఎఫ్ సీఐ సిహెచ్ శ్రీనివాస్ బృందం కలిసి భద్రాచలం కూనవరం ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద మాటు వేసి ముంబాయి వెళుతున్న గంజాయిని పట్టుకున్నారు. ఈ కేసులో ముంబాయికి చెందిన యూసఫ్ సహీద్ ఖాన్, డ్రైవర్ మహ్మమద్ షరీఫ్‌పై కేసు నమోదు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ సిహెచ్ శ్రీనివాస్ వెల్లడించారు.

ఏపీలో మద్యం షాపుల ఏర్పాటుపై రెండురోజుల్లో మార్గదర్శకాలు

-మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి, సెప్టెంబర్ 30:ఏపీలో మద్యం షాపుల ఏర్పాటుపై రెండురోజుల్లో మార్గదర్శకాలు జారీ చేయనున్నామని ఏపీ ఆబ్కారీశాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గత టీడీపీ హయాంలో మాదిరిగానే ప్రభుత్వ పర్యవేక్షణలో ప్రైవేట్ షాప్స్ నిర్వహణ జరిగేలా నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

ఏ జిల్లాలో ఎన్ని షాపులు అనే వివరాలు వెల్లడిస్తామని, 7 రోజుల పాటు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. సెలవుల మధ్యలో రెండురోజుల పాటు సెలవులు వస్తున్నాయని తెలిపారు. పదో రోజున డ్రా తీస్తామని వివరించారు. దసరా పండుగకు ముందే మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు.

విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న హీరో కార్తీ

విజయవాడ, సెప్టెంబర్ 30: తమిళ నటుడు కార్తీ విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నాడు. కార్తీ నటించిన తాజా చిత్రం 'సత్యం సుందరం'. ఈ సినిమాకు 96 దర్శకుడు ప్రేమ్ కుమార్ దర్శకత్వం వహించాడు. సెప్టెంబర్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకుంది.

సినిమా చూసిన ప్రేక్షకులందరూ చాలా రోజులకు ఒక మంచి సినిమా చూశామంటూ కామెంట్లు పెడుతున్నారు. అయితే ఈ మూవీ సాధించిన విజయం పట్ల హీరో కార్తీ, దర్శకుడు ప్రేమ్ కుమార్ విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. సోమవారం ఉదయం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు ఆశీర్వాదం అందించారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం హీరో కార్తీకి దర్శకుడు ప్రేమ్‌కి స్వాగతం పలికారు.

ఇల్లంటే జీవితకాల కష్టానికి ప్రతిరూపం.. వాటిని కూలుస్తుంటే అడ్డుగా నిలబడతాం- కెటిఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30: తెలంగాణలో అధికారం కోసం కాంగ్రెస్ ఏదేదో చెప్పిందని.. తీరా అధికారంలోకి వచ్చాక ఇంకేదో చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు మండిపడ్డారు. మూసి బాధితుల పాలిట కాలయముడిలా సీఎం రేవంత్ రెడ్డి తయారయ్యారని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మూసీ సుందరీకరణ దేశంలోనే అతిపెద్ద స్కామ్ అని మరోసారి ఆరోపించిన ఆయన.. హైడ్రా బాధితుల తరపున పోరాడి తీరతామని ఉద్ఘాటించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారాయన.

తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ ఏం చెప్పింది? ఇప్పుడు ఏం చేస్తోంది?. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామంది. కళ్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం అని ప్రకటించింది. ఎన్నికల ముందు తెలంగాణలో చక్కర్లు కొట్టిన రాహుల్ గాంధీ ఎక్కడికి వెళ్లారు అంటూ ప్రశ్నించారు.

హైదరాబాద్ నగరంతో పాటు సూర్యాపేట,ఆదిలాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో ప్రభుత్వం దుందుడుకు చర్యలకు పాల్పడుతోంది. పేదల ఇల్లు కూల్చి పెద్దలకు లాభం చేయమని ఏ ఇందిరమ్మ,సోనియమ్మ చెప్పింది. వరి సాగులో తెలంగాణ టాప్ గా నిలిచింది ఇది కాళేశ్వరం ఘనత కాదా.. 2016లో బీఆర్ఎస్ హయాంలో చెరువులు, బఫర్, ఎఫ్.టి.ఎల్ డ్రా చేస్తూ జీవో ఇచ్చాం. మూసీలో మేము పేదల కడుపు కొట్టకుండా బ్యూటిఫికేషన్ చేశాం. ఎస్.టి.పి లు మేము పూర్తి చేశాం. మేము నిర్మాణం చేస్తే మీరు విధ్వంసం చేస్తున్నారు అంటూ పేర్కొన్నారు.

మూసీ కోసం లక్షా 50 వేల కోట్లా..

తెలంగాణలో లంకెబిందెలు లేవని అంటున్నారు. మరి మూసీ అభివృద్ధి ఏం ఆశించి చేస్తున్నారు?. మరోవైపు మూసీకి లక్షా 50 వేల కోట్లు ఖర్చు పెడతామని అంటున్నారు. 2,400 కిలోమీటర్ల గంగానది ప్రక్షాళనకు పెట్టిన బడ్జెట్ 40 వేల కోట్లు. సబర్మతి రివర్ ప్రాజెక్టుకు 7,000 కోట్లు ఖర్చు అయింది. యమునా రివర్ ప్రాజెక్టుకు ఖర్చు అయింది వెయ్యి కోట్లు. అలాంటిది 55 కిలోమీటర్ల మూసీ సుందరీకరణ కోసం లక్షా 50 వేల కోట్లు ఖర్చు అవుతుందని సీఎం రేవంత్ అంటున్నారు. మూసీ సుందరీకరణ కాంగ్రెస్ పార్టీకి రిజర్వ్ బ్యాంకులాగా ఉందా?. మూసీ ప్రాజెక్టుతో మురిసేది ఎంతమంది?. మూసీ సుందరీకరణతో ఒక్క ఎకరానికి అయినా నీళ్లు వస్తాయా?. ఇది స్కామ్ కాక మరి ఏం అవుతుంది.

ఇల్లంటే జీవితకాల కష్టానికి ప్రతిరూపం

'నీఎం ఒకమాట అర్థం చేసుకోవాలి. ఒక పేద, మధ్యతరగతి కుటుంబానికి ఇల్లు అనేది జీవితకాలం వారు చేసిన కష్టానికి ప్రతిరూపం. ఇల్లు అనేది ఒక ఎమోషన్. ఇల్లు అనేది ఆ కుటుంబం కలలుగనే ఒక సౌధం. అది ఒక నాలుగు ఇటుకలు, రెండురాళ్లు పెట్టిన కట్టిన కట్టంకాదు. ఇల్లు జ్ఞాపకాల పొదరిల్లు. అలాంటి జ్ఞాపకాన్ని కూల్చేస్తామంటే ఆ బాధ మీకు తెలియది కావచ్చు రేవంత్‌రెడ్డి. కానీ, మాకు తెలుసు. స్వయంగా కేసీఆర్ కుటుంబం రెండుసార్లు డిస్‌ప్లేస్ అయ్యాం. మా నాయనమ్మ ఊరు పోసాన్‌పల్లి. ఎగువ మానేరు డ్యామ్‌లో 1940లో మునిగిపోతే అక్కడి నుంచి తట్టాబుట్ట పట్టుకొని చింతమడకకు వచ్చింది మా కుటుంబం. మా అమ్మమ్మగారి ఊరు మొన్న మిడ్‌మానేరులో 2014 తర్వాత మా ప్రభుత్వంలో మునిగిపోయింది.

మా జ్ఞాపకాలు అందులోనే మునిగిపోయినయ్. ఒకసారి కాదు.. రెండుసార్లు డిస్‌ప్లేస్ అయినం. మాకు ఆ బాధ ఎలా ఉంటుందో తెలుసు. ఒకసారి నిర్వాసితులుగా మారితే ఊరుతో అల్లుకున్న జ్ఞాపకాలు.. ఆ ఇంటితో అలుముకున్న కొన్ని ఆశలు, ఆకాంక్షలు ఎలా ఉంటాయో మాకు తెలుసు.. రేవంత్‌రెడ్డికి తెలియకపోవచ్చు. మీలాగా ఆయాచితంగా.. లక్కీడ్రాలో వచ్చినట్లు దన్‌మని ఊడిపడలేదు. ప్రజలు కష్టపడి కట్టుకున్నారు. ఇవాళ మీరు సీఎంగా ఉన్నారు కావొచ్చు కానీ.. మీ కాంగ్రెస్ ప్రభుత్వమే అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ఇండ్లు ఇవీ. 20, 30, 40 ఏళ్ల రెక్కల కష్టంతోని ఇండ్లు. పట్టాలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. ఇంటినంబర్లు ఉన్నాయి. కరెంటు బిల్లు ఉన్నయ్. నల్లా బిల్లులు ఉన్నయ్. చట్టరీత్యా అన్నిరకాలుగా న్యాయమైన పూర్తిస్థాయిలో ప్రభుత్వం గుర్తించిన ఇండ్లు' అన్నారు. 1994 లో కాంగ్రెస్ ప్రభుత్వం తమకు పట్టాలు ఇచ్చిందని భాదితులు అంటున్నారు.అలాంటప్పుడు లక్షమంది ప్రజలను నిరాశ్రయులను చేసే అధికారం రేవంత్ రెడ్డికి ఎవరు ఇచ్చారు?. ఇళ్లు కూలగొడుతుంటే ప్రజలు ఊరుకుంటారా?. లక్షలాది మంది జీవితం నాశనం చేస్తున్నారు. వాళ్లు తిరగబడకముందే మేల్కొండి అంటూ కెటిఆర్ హితవు పలికారు

సెక్రటేరియేట్ కూడా కూలుస్తారేమో!

హైడ్రా దెబ్బకు రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గింది. ఎవరి కోసం హైడ్రా తీసుకొచ్చారు. పేదల ఇళ్లు కూల్చాలని ఎవరు చెప్పారు?. ప్రభుత్వ వైఖరితో పేదలు ఇబ్బంది పడుతున్నారు. కూల్చాల్సి వస్తే ముందు హైడ్రా ఆఫీస్‌నే కూల్చాలి. రెండోదిగా జీహెచ్ఎంసీ ఆఫీసును కూల్చాలి. నాలాపై ఉన్న జీహెచ్ఎ ంసీ ఆఫీసును కూలుస్తారా. ఎఫ్.టి.ఎల్ లో సెక్రటేరియట్ ఉందని రేవంత్ రెడ్డి కూలుస్తారేమో అని అనుమానం ఉంది. కేసీఆర్ ఆనవాళ్లను లేకుండా చేయడమే రేవంత్ రెడ్డి లక్ష్యం. ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇళ్లు కూలగొడుతున్నారు. మంత్రులు ఎందుకు మూసీ గురించి చెప్పడం లేదు. అధికారుల వెనక దాక్కుని కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటి వరకు మూసీ సుందరీకరణపై డి.పి.ఆర్ రెడీ కాలేదు. డి.పి.ఆర్ రెడీ కాకుండా ఇళ్ళు ఎందుకు కూలగొడుతున్నారు అంటూ నిలదీశారు.

చట్ట ప్రకారం నడుచుకోవాలని హైడ్రా కమిషనర్ కు చెప్పిన తెలంగాణ హైకోర్టుకు ధన్యవాదాలు. బీఆర్ఎస్ లీగల్ సెల్ ఇప్పటికే లంచ్ మోషన్ పిటీషన్ దాఖలు చేసింది. ఇప్పటికే మా నేతలు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. పొరపాటున కాంగ్రెస్ వాళ్లు మూసీ బాధితుల వద్దకు వెళ్లవద్దు.బాధితులకు మేం అండగా నిలబడతాము. బాధితులకు కోసం సుప్రీంకోర్టు వరకు వెళ్తాము. సాగరహారం లాంటి ధర్నాలు తెలంగాణలో వచ్చే విధంగా ఉన్నాయని అన్నారు కెటిఆర్

సావాస దోషంతోనే మంత్రి మాటలు

5 వేల రూపాయలకు సోషల్ మీడియాలో మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ లాగా పీసీసీ పదవిని అమ్ముకోవడం,సీఎం పదవిని అమ్ముకోవడం తెలంగాణ ప్రజలకు రాదు. సావాస దోషంతో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు.రేవంత్ రెడ్డికి లక్కీడ్రాలో ముఖ్యమంత్రి పదవి వచ్చింది. 50 కోట్లకు పీసీసీ పదవీ , 500 కోట్లకు సీఎం పదవీ నీ కాంగ్రెస్ అమ్ముకుంది అంటూ ఆరోపించారు కెటిఆర్

ముందు నీ ఇలు , నీ సోదరుడి ఇల్లు కూలగొట్టు..

సీఎం రేవంత్ రెడ్డి ఇంటి నుండి వచ్చే మురికినీరు ఎక్కడికి పోతుందో రేవంత్ రెడ్డికి తెలుసా?. కొడంగల్ లో సీఎం రేవంత్ రెడ్డి ఇళ్ళు కుంటలో ఉంది. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడి నివాసం ఎఫ్.టి.ఎల్ లో ఉంది. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే నీ సోదరుడి ఇళ్ళు కూలగొట్టు.

ఈ రోజు ఆక్రమణలంటున్నారు కదా.. ఎవరైనాతో నాడు పర్మిషన్ ఇచ్చారో ఆనాడు.. ఎవరైనా అధికారులు.. ప్రభుత్వాలున్నాయో వారిపై చర్యలు తీసుకో. 2016లో వచ్చి జీవో ఇచ్చే వరకు మీ ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోలేదు నేను అడుగుతున్నా. అన్నింటికి మంచి లక్షలాది మంది జీవితాలు అంధకారం చేస్తానసంటే ఊరుకోం. ఒక్కమాట అడుగుతున్నా ముఖ్యమంత్రిని.. మీ ప్రాధాన్యం ఏంటీ అసలు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటవా..? ప్రజలకు ఇచ్చిన మాట ఏందీ? రైతులకు రైతుభరోసా అన్నారు.. రైతుకూలీలకు నెలకు రూ.1000 ఇస్తామన్నారు. ఆటోడ్రైవర్లను బాగా చేసుకుంటాం అన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామన్నారు.. నెలకు రూ.2500 ఇస్తానన్నావ్. ఏదీ చేయకపోగా.. వాటికి పైసలు లేవట. చేతులు రావు.. మనసు రాదు. పక్క రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పింఛన్లు పెంచారు. తెలంగాణలో పింఛన్లు ఎందుకు పెంచలేదు. రైతులకు ఇప్పటి వరకురైతు భరోసా ఇవ్వలేదు. ముందు వంద రోజుల్లో చేస్తామని చెప్పిన హామీలు రేవంత్ రెడ్డి అమలు చేయాలి. కానీ రూ.1.50లక్షల కోట్లు ఒక మూసీ ప్రాజెక్టుకు వెచ్చిస్తున్నారు' అంటూ ధ్వజమెత్తారు.

రూ. 6వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ పశువైద్యాధికారి

నల్గొండ, సెప్టెంబర్ 30: నల్గొండ జిల్లాలో అవినీతికి పాల్పడ్డ పశు వైద్యాధికారిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జిల్లాలోని చింతపల్లిలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ పాల్ జోసెఫ్ గౌతం సోమవారం రూ. 6 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.

మండలానికి చెందిన ఇద్దరు పశు యజమానులు తమ పశువులకు హెల్త్ వాల్యూయేషన్ సర్టిఫికేట్ కోసం చింతపల్లి వైద్యుడిని సంప్రదించారు. సదరు వైద్యుడు డబ్బులు డిమాండ్ చేయడంతో వారు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం ఉదయం కార్యాలయంలో అసిస్టెంట్ సర్జన్ లంచం తీసుకుంటుండడగా పట్టుకున్నారు. వైద్యుడిని అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టు(ంఅః అనీబీతీబి) లో ప్రవేశపెట్టామని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే 1064 అనే టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

"గ్రీవెన్స్ డే"లో జిల్లా ఎస్పీకి తమ సమస్యలను తెలుపుకున్న భాదితులు

- భాధితుల సమస్యల పట్ల విచారణ చేపట్టి త్వరగా పరిష్కారించాలని అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి) : గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఎస్పీ కార్యాలయానికి వివిధ రకాల సమస్యలతో వచ్చిన భాదితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అట్టి సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. సోమవారం ఇట్టి కార్యక్రమంలో మొత్తం 15మంది భాదితులు ఎస్పీని స్వయంగా కలిసి తమ సమస్యలను తెలుపుకున్నారు. ఇందులో 4గురు భాధితులు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో తమ ఫిర్యాదుల మేరకు నమోదైన కేసులలో జాప్యం జరగకుండా విచారణ జరిపించి తమకు న్యాయం చేకూర్చాలని కోరుతూ కేసుల వివరాలను ఎస్పీకి తెలియజేశారు. ముగ్గురు భాదితులు తమ భూమికి సంభందించిన విషయంలో న్యాయం కోరుతూ ఫిర్యాదు చేశారు. ఇద్దరు భాధితులు తమ ఇండ్లలో జరిగిన దొంగతనం కేసుల విషయమై దొంగలను పట్టుకుని పోగొట్టుకున్న తమ సొత్తును తమకు అందేవిధంగా చేసి తమకు న్యాయం చేకూర్చాలని కోరారు. నలుగురు బాధితులు కుటుంబ కలహాల గురించి నమోదైన కేసుల విషయమై ఫిర్యాదు చేయడమైనది. మరో రెండు ఫిర్యాదులు తమ అసోసియేషన్స్ విషయమై కొంతమంది వ్యక్తులు అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఇట్టి భాధితుల విషయంలో వెంటనే విచారణ చేపట్టి భాధితులకు న్యాయం చేకూర్చాలని సంభంధిత అధికారులకు ఎస్పీ ఆదేశించారు.

ప్రభుత్వం రైతులకు ఇస్తామని చెప్పిన రూ. 2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలి..

- రైతు భరోసా, రైతు బీమా, వడ్లకు బోనస్ వంటి అంశాలను వెంటనే పరిష్కరించాలి
- పేదల కన్నీళ్ళలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది బీ కేర్ ఫుల్
- బిల్డర్లు దగ్గర డబ్బులు వసూలు చేసి హైకమాండ్ కి డబ్బులు పంపడానికే..
- మూసీ ప్రక్షాళన కాదు లక్షన్నర కోట్లలో వచ్చే కమిషన్ కోసం.
- దమ్ముంటే రుణమాఫీ చెయ్యి, రైతుబందు ఇవ్వు..ఆరు గ్యారంటీలు అమలు చేయు.
- కానీ ఇలా పేదల ఉసురు పోసుకోవద్దు.
- హెచ్చరించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30: (ఎక్స్ ప్రెస్ న్యూస్);అన్నదాతలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మభ్యపెడుతున్న మోసకారి కాంగ్రెస్ సర్కారు మెడలు వంచి రైతులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయించేలా ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద బిజెపి రైతు హామీల సాధన దీక్షను ప్రారంబించింది.ఈ దీక్షలకు రాష్ట్ర నలుమూలలనుండి పెద్ద ఎత్తున రైతులు పార్టీ అభిమానులు తరలి వచ్చారు.దద్ కహాలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇస్తామని చెప్పిన రూ. 2 లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా, రైతు బీమా, వడ్లకు బోనస్ వంటి అంశాలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు.రేవంత్ రెడ్డి అధికారం నెత్తికి ఎక్కి ఎవరినీ లెక్కజేయని స్థాయికి ఎదిగిండు. కేసీఆర్ కి 6 ఏళ్లు పడితే.. రేవంత్ కి మూడు నెలలే పట్టింది. మోసానికి దగాకు మారుపేరు రేవంత్.

హైడ్రా బూచి చూపు బిల్డర్ల దగ్గర డబ్బులు వసూలు చేసి హైకమాండ్ కి డబ్బులు పంపడానికి. మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నర కోట్లలో వచ్చే కమిషన్ కోసం. హైకోర్టు హైడ్రాపై స్పందించింది. ఈరోజు శుభదినం. హైకోర్టు తప్పు పట్టింది అధికారులను కాదు రేవంత్ రెడ్డిని. రేవంత్ నీకు రేషం ఉంటే దిగిపో.. మూసీ, హైడ్రా బాధితులకు మేము అండగా ఉంటాం.హామీల మీద రోడ్ మ్యాప్ ప్రకటించాలి. ఇప్పటివరకు ఎంత రుణమాఫీ అయ్యిందో పబ్లిక్ పోర్టల్లో పెట్టాలని డిమాండ్ చేస్తున్న. రుణమాఫీ చేయకుంటే నీ భరతం పట్టుడు ఖాయం. పేదల కన్నీళ్ళలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది బీ కేర్ ఫుల్ అని హెచ్చరించారు .రేవంత్ రెడ్డి అబద్దాల హామీలు ఇస్తే నమ్మి ప్రజలు ఓట్లు వేశారు. మోసానికి, దగాకు మారుపేరు రేవంత్ . రాహుల్ గాంధీని కూడా బోల్తా కొట్టించారు. 2018 లో కూడా కాంగ్రెస్ రెండు లక్షల రుణమాఫీ చేస్తా అన్నారు. ఆనాడే సాధ్యం కాదు అని చెప్పిన. మోసపు మాటలు అని చెప్పిన.కేసీఆర్ కూడా అలవికాని హామీ ఇచ్చారు. అడ్రస్ లేకుండా పోయారు. రుణమాఫీ చేస్తా అంటే.. రేవంత్ ను నమ్మి రైతులు ఓట్లు వేశారు. కేసీఆర్ ను ఓడించాలని ప్రజలు, విద్యార్థులు, ప్రజాస్వామిక వాదులు కాంగ్రెస్ కు ఓటు వేశారు. ఆరు గ్యారంటీలలో ఒక్క ఉచిత బస్సు తప్ప ఏమీ అమలు కాలేదు. 17900 కోట్లు రుణమాఫీ చేశామని సిఎం కార్యాలయం ప్రకటించింది తప్ప ఎక్కడా లెక్కలు చెప్పలేదు. దమ్ముంటే ఎంత అయ్యిందో లెక్కలతో సహా ప్రజా పోర్టల్ లో పెట్టాలని డిమాండ్ చేస్తున్న.బిజెపి, మోడీ గారు మాట ఇస్తే తప్పరు. ఎరువుల కోసం లైన్లు కట్టే దౌర్భాగ్య స్థితి లేకుండా... కాంగ్రెస్ మూసేసిన రామగుండం ఎరువల ఫ్యాక్టరీని 6300 కోట్లతో ప్రారంభించి తెలంగాణలో ఎరువుల కొరత లేకుండా చేసిన మహనీయుడు మోదీ. దేశవ్యాప్తంగా రైతులకు 6 వేల రూపాయలు ఇస్తున్న ప్రభుత్వం బీజేపీ.మమ్ముల్ని మీరు ప్రశించేది. రైతులకు అండగా ఉండేందుకే ఈ రోజు దీక్ష చేస్తున్నాం.రుణమాఫీ చేయకుంటే నీ భరతం పట్టుడు ఖాయమన్నారు. హైడ్రా పేరిట డ్రామా చేస్తూ పేదల ఇళ్లను కూలుస్తున్నారు..మా పక్షాన కూడా దీక్ష చేయండి అని అడుగుతున్నారు. మూసీ ప్రక్షాళన చేస్తే అని మాట తప్పిన ఃఖీూ కు చిత్తశుద్ధి లేదు మీరే కొట్లాడాలి అని ప్రజలు కోరుతున్నారన్నారు. చర్లలో మంచినీరు లేదు. డ్రైనేజీ కంపు నీళ్ళతో నిండాయి. ఆ నీళ్ల బొర్లలోకి వచ్చి అవి తాగితే జబ్బులు వస్తున్నాయి.మిస్టర్ రేవంత్ రెడ్డి.. ఇంత పెద్ద నిర్ణయం తీసుకొనే ముందు ప్రజాప్రతినిధులను సంప్రదించావా ? క్యాబినెట్ లో చర్చించావా ? ఓఎం లకు చెప్పావా ? ఈయన్ను చూస్తే పేదల ఇళ్లను కూల్చి పేదల ఉసురు పోసుకున్న సంజయ్ గాంధీ గుర్తుకు వచ్చాడు. ఆయన వారసుడు ఈయన. అప్పట్లోనే మూసీలో రాతి కట్టడాలు కట్టి రక్షణ కల్పించారు. ఇప్పుడు కూడా చేయు. కానీ నీ ఉద్దేశ్యం మూసీ ప్రక్షాళన కాదు. ఎవడబ్బ సొమ్ము.. మా ఇల్లు గుంజుకోవడానికి నువ్వు ఎవరు ? హుస్సేన్ సాగర్ జలవిహార్, ప్రసాద్ తిఎజీలీ, ప్యారడైజ్ ఎవరు కట్టారు. అవి వదిలిపెట్టి పేదల కొంపలు కూల్చే అధికారం నీకు ఎవడు ఇచ్చాడు.పేదల కన్నీళ్ళలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది బీ కేర్ ఫుల్. తెలంగాణ ప్రజలారా మేము చెప్తుంది రాజకీయం కోసం కాదు. 50 రోజులుగా మేము చేసిన ప్రజపొరటానికి ఈ రోజు హైకోర్టు స్పందించింది. ఈరోజు శుభదినం. హైకోర్టు తప్పు పట్టింది అధికారులను కాదు రేవంత్ రెడ్డినిరేషం ఉంటే దిగిపో.. రంగనాథ్ నాకు ఎవరు చెప్పాల్సిన అవసరం లేదు అన్నారు,ఇప్పుడు ఏమంటున్నారు. మెదావుల్లారా హైదరాబాద్ చెరువు ఉపయోగపడడం లేదు. ఆ మురికి నీళ్లు తీసి మంచి నీటితో నింపేందుకు పోరాడండి. ఎకోలాజికల్ బ్యాలెన్స్ కాపాడాలంటే చెరువులు మంచి నీటితో నింపండి. సూరరం చెరువు కింద ఎప్పుడో పట్టాలు ఇస్తే 600 మంది ఇల్లు కట్టుకున్నారు. వాటిని కూలుస్తా అంటున్నారు. జొన్నబండలో తాతల కాలం నుండి ఉంటే ఇప్పుడు నోటీసులు ఇచ్చారు. గగన్ పహాడ్ లో బిజెపి కార్పొరేటర్ అని శ్రీనివాస రెడ్డి షెడ్లు కూలగొట్టడమే కాదు ఆ మిషన్ల మీద డోజర్లు ఎక్కించి ధ్వంసం చేశారు. అక్కడే వాటార్ ప్యాకెట్లు అమ్ముకుని బ్రతికే ఆమె నాకు కాన్సర్ కొడుకు ఉన్నారు.. ఇదే నా జీవనాధారం అని కాళ్ళమీద పడ్డా వదల్లేదు. చైతన్యపురి లో రెండు రోజుల్లో డెలివరీ అయ్యే మహిళను కూడా బయటకు నెట్టివేశారు. కిషన్ రెడ్డి గారు హైడ్రా గురించి ఉత్తరం రాస్తే ఇంతవరకు సమాధానం లేదు. రెండింటి కోసం రేవంత్ ఇదంతా చేస్తున్నాడు బిల్డర్లు దగ్గర డబ్బులు వసూలు చేసి హైకమాండ్ కి డబ్బులు పంపడానికి. మూసీ ప్రక్షాళన కాదు లక్షన్నర కోట్లలో వచ్చే కమిషన్ కోసం. దమ్ముంటే రుణమాఫీ చెయ్యి,రైతుబందు ఇవ్వు,దమ్ముంటే ఆరు గ్యారంటీలు అమలు చేయు. కానీ ఇలా పేదల ఉసురు పోసుకోవద్దని హెచ్చరిఉంచారు.

రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్‌అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మన్యం రమేష్ బాబు-డాక్టర్ గంధం నాగయ్య

-రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్నూతన కార్యవర్గం ఎన్నిక
-అధ్యక్ష ప్రధాన కార్య దర్శులుగా మన్యం రమేష్ బాబు, డాక్టర్ గంధం నాగయ్య

హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రెసిడెంట్ గా డాక్టర్ మన్యం రమేష్ బాబు, జనరల్ సెక్రెటరీ గా డాక్టర్ గంధం నాగయ్య గెలుపొందారు.తెలంగాణ రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం శాంతినగర్, హైదరాబాద్ లో జరగగా మన ప్యానెల్ నుండి పోటీ చేసిన 12 మంది అభ్యర్థులకు 12 మంది క్లీన్ స్వీప్ తో గెలుపొందారు..మొత్తం 678 డాక్టర్ లు ఉండగా ,మొత్తం 606 ఓట్లు పోలయ్యాయి. ప్రెసిడెంట్ అభ్యర్థి గా గెలుపొందిన డాక్టర్ మన్యం రమేష్ బాబు కి 399 ఓట్లు పడగా,ప్రత్యర్థి అభ్యర్థి డాక్టర్ ఎం.నాగరాజు యాదవ్ కి 204 ఓట్లు పోలయ్యాయి.195 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు..అలాగే అసోసియేట్ ప్రెసిడెంట్ గా డాక్టర్ మారం శ్రీధర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ గా డాక్టర్ గంధం నాగయ్య, కోశాధికారి గా డాక్టర్ శ్రీధర్ వర్మ , వైస్ ప్రెసిడెంట్లుగా1.డాక్టర్ బద్దం రాజేంధర్ రెడ్డి,2.డాక్టర్ కౌలురి విజయలక్ష్మి3.డాక్టర్ జనార్దన్ లకావత్4.డాక్టర్ వడ్డేపల్లి రమేష్ లు గెలుపొందగా.. జాయింట్ సెక్రటరీలు గా1. డాక్టర్ కేతావత్ భాను నాయక్2. డాక్టర్ నెల్లికొండ శ్రావణి గౌడ్,3. డాక్టర్ కండెల సంతోష్ రెడ్డి4. డాక్టర్ పూడూరి రాజ్ కుమార్ లు గెలుపొందారు..గెలుపొందిన ప్రెసిడెంట్ డాక్టర్ మన్యం రమేష్ బాబు గారు మాట్లాడుతూ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల హక్కుల పోరాటానికై, సంక్షేమానికి మరియు గౌరవం పెంపొందించే విధంగా కృషి చేస్తుందని.. అన్నిటికంటే ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా పెండింగ్ ఉన్న డిపార్ట్మెంట్ పునర్వ్యవస్థీకరణ ఫైల్ ని మరియు ఇతర ప్రధాన సమస్యలను ప్రభుత్వ సహకారంతో సాధించుకుంటామని వారు పేర్కొన్నారు.

ఏమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు కాంగ్రెస్ నేతల ఘన సన్మానం

ఖమ్మం, సెప్టెంబర్ 30: (నేటినిజం ప్రతినిధి): గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన అమీర్ అలీఖాన్ పలు ప్రైవేట్ కార్యక్రమాలలో పాల్గొనటానికి మొదటిసారిగా ఖమ్మం విచ్చేసిన సందర్భంగా వారు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గాప్రసాద్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకం గా కలిసి జిల్లాలో పార్టీ అభివృద్ధి గురించి చర్చించారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పలువురు కాంగ్రెస్ నేతలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, ఓబిసి ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, మిక్కిలినేని నరేంద్ర, షేక్ అబ్దుల్ రషీద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కమతం రామకృష్ణ, పాలకుర్తి నాగేశ్వరరావు, జిల్లా కిసాన్ సేల్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ హుస్సేన్, సేవాదళ్ అధ్యక్షులు షేక్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులేవి శ్రీసాయి మారుతీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

- అనుమతులతో పనేముంది...
- నగరంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్న శ్రీసాయి మారుతీ హాస్పిటల్స్..
- నివాస గృహాలను ఆసుపత్రులుగా మార్చి జోరుగా వైద్య వ్యాపారం..
- ఒకే అనుమతితో ఐదు చోట్ల వేర్వేరు బ్రాంచీల నిర్వహణ..
- కార్పొరేట్ స్థాయి వైద్యం అంటూ ఇరుకు గదులు ఇష్టారీతిన ఫీజల వసూళ్లు..
- పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్న వైద్య శాఖ అధికారులు...

ఖమ్మం, సెప్టెంబర్ 30: (నేటినిజం ప్రతినిధి): కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు, మా రోగులకే సొంతం అంటూ ప్రచారంతో హోరెత్తించి మా హాస్పిటల్లో చేర్పించండి మంచి వైద్యం అందిస్తాం అని నమ్మబలికి, లక్షల్లో ఫీజులు దండుకునే బడా హాస్పిటల్ శ్రీసాయి మారుతీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ పేరుతో ఖమ్మం నగరంలో కొత్త దందాకు తెరలేపారు. అడుగడుగునా ప్రభుత్వ ఆసుపత్రుల నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారీతిగా తమ ఆధిపత్యం చేలాయిస్తూ అనుమతులు లేని పునాదులపై వైద్య వ్యాపారాన్ని సాగిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో తమకు ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్నాయని చెప్పే శ్రీసాయి మారుతీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంస్థల పేరుతో చలామణి అవుతూ రోగులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. ఆసుపత్రులను నిర్వహిస్తున్న శ్రీసాయి మ

విశిష్ట సేవలకు పురస్కారం ప్రశంసనీయం

హైదరాబాద్, సెప్టెంబర్ 30:విశిష్ట సేవలందించిన సాహితీవేత్తలకు పురస్కారాలు అందించడం ప్రశంసనీయమని ఉస్మానియా విశ్వ విద్యా లయ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ అధ్యక్షతన సెప్టెంబరు 22న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ప్రజాకవి కాళోజీ పురస్కారాన్ని ప్రముఖ కవి, రచయిత డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు కు అందజేసిన సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా డా. పాకాల యశోదారెడ్డి పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి వీణారెడ్డికి అందజేయడంతో పాటు ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. పురస్కార గ్రహీతలు డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు, వీణా రెడ్డి సాహిత్య రంగంలో విశేష కృషి చేశారని ఈ సందర్భంగా ముఖ్య అతిథి కసిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. మహిళా సాధికారిత పెంపొందించే సంస్థల్లో తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ అగ్రస్థానంలో ఉందని అన్నారు. డాక్టర్ పాకాల యశోదారెడ్డి తెలంగాణ యాసలో అద్భుతమైన రచనలు చేసి ఈ పాలమూరు జిల్లాకు తలమానికంగా నిలిచారని అన్నారు. కాళోజీ తెలంగాణ భాషకు ఉన్నత స్థాయి కల్పించారని కాళోజీ పురస్కార గ్రహీత డా.రాయారావు సూర్యప్రకాశ్ రావు అన్నారు. పురస్కారాలు బాధ్యతను పెంచుతాయని ఆయన పేర్కొన్నారు.

మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

హైదరాబాద్, సెప్టెంబర్ 30:హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణికులకు శుభవార్త. మెట్రో అందిస్తున్న హాలిడే సూపర్ సేవర్ ఆఫర్ ను వచ్చే ఏడాది మార్చి వరకు పొడిగిస్తున్నట్లు తెలిపింది. సూపర్ సేవర్ ఆఫర్ తో రూ.59కి అన్ని సెలవు దినాల్లో అపరిమిత ప్రయాణాన్ని అందిస్తుంది. ఇంతకుముందు మెట్రో ప్రయాణికులు కొనుగోలు చేసిన హాలిడే కార్డుతో ఈ సౌకర్యాలను పొందవచ్చు. కాగా, ఈ ఆఫర్ మార్చి 31, 2025 వరకు అందుబాటులో ఉంటుందని హైదరాబాద్ మెట్రో తెలిపింది.

పేదల ఇళ్లకు కాదు.. రేవంత్ ఇంటి మీదకు టాస్క్‌ఫోర్స్ పోలీసులను పంపించండి: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 30: హైడ్రా వ్యవహారంలో నిజమైన బాధితులు తెలంగాణ పేద ప్రజలు అని.. అసలు నిందితుడు సీఎం రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మూసీ పేరుతో లూటీకి ప్లాన్ చేసి.. అడుగడుగునా జుగుప్సాకరమైన భాష వాడిన సీఎం రేవంత్ రెడ్డిపై ముందు కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులను సీఎం ఇంటి మీదకు పంపించండి.. పేదల ఇళ్లకు కాదని తెలంగాణ పోలీసులకు సూచించారు.

హైడ్రా వ్యవహారంతో నష్టపోయిన బాధితులు సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసిన వీడియోలను షేర్ చేశారనే ఆరోపణలతో కల్వకుర్తి మండలం కడ్తాలలో బీఆర్ఎస్ కార్యకర్త నరేశ్‌ను అరెస్టు చేయడంపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రి పోలీసులను కడ్తాలకు పంపి నరేశ్‌ను అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారని ఆయన తెలిపారు. నరేశ్‌తో పాటు అతని మిత్రులకు చెందిన 4 ఫోన్లను అక్రమంగా గుంజుకున్నారని మండిపడ్డారు. బీఎన్ఎస్ఎస్ 35(3) యాక్ట్ ప్రకారం నరేశ్‌ను బెయిల్‌పై రిలీజ్ చేసే అవకాశం ఉన్నప్పటికీ ఇంకా విడుదల చేయట్లేదని అన్నారు. అందుకే పోలీస్ స్టేషన్‌కు వచ్చామని వివరించారు

నరేశ్ ఒక్కడినే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ఎంతోమంది పేద ప్రజలపై రాత్రికి రాత్రే కేసులు పెట్టారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇంకా ఎన్ని రోజులు, ఎంతమంది ప్రజలను ఇట్ల సతాయిస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించే 66 ఐటీ యాక్ట్ చెల్లదని ముంబై హైకోర్టు చెప్పిన తర్వాత కూడా ఇంకా జ్ఞానోదయం కాలేదా అని మండిపడ్డారు.

రక్తదానం... ప్రాణదానమే - సాయి చౌదరి

(నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవనీ)

వికారాబాద్ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : విధి వంచితులకు, క్షతగాత్రులకు, ప్రమాదం బారిన పడి అల్లాడే వారిని బతికించడానికి ఇవ్వాల్సింది రక్తం. ఒకప్పుడు రక్తదానం చేయాలంటే భయపడేవారు. ఇప్పుడు రక్తం ఇవ్వడానికి ముందుకు వస్తుండడం శుభపరిణామం. రాష్ట్రంలో ఎంతోమంది దాతలు రక్త నిధి కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన వారికి రక్తం అందించి ఎంతో మంది అభాగ్యుల ప్రాణాలు నిలుపుతున్నారు. ప్రాణం నిలపడానికి అవసరమైన ఈ రక్తం గురించి చాలామందికి తెలియదు. అసలు రక్తదానం ఎందుకు చేయాలి. రక్తదానం చేయాలంటే ఎవరిని సంప్రదించాలి. రక్తదానం చేస్తే లాభాలేంటి అనే అంశాలపై నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవ సందర్భంగా వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి తో ప్రత్యేక కథనం..,

ఎవరు రక్తదానం చేయాలి :

18 నుంచి 65 సంవత్సరాల లోపు ఉండి 45 కిలోల కంటే బరువు ఎక్కువగా ఉన్న ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చు. గతంలో రక్తదానం చేసి ఉంటే మూడు నెలల తర్వాత తిరిగి చేయవచ్చును. రక్తపోటు సాధారణ స్థితిలో ఉన్నవారు, గుండె జబ్బులు లేనివారు రక్తదానం చేయవచ్చును. రక్తదానం చేసినా చేయకపోయినా ప్రతి మనిషి రక్తనీలోని జీవకణాల జీవిత కాలము నాలుగు నెలలు మాత్రమే. రక్తదానం చేసిన తర్వాత 24 గంటల లోగా ప్లాస్మా ఏర్పడుతుంది. నాలుగు వారాల్లోగా జీవ కణాలు ఏర్పడతాయి.

రక్త మార్పిడి ఎందుకు?

రక్తంలో భాగంగా ఉండే కొన్ని అంశాలు తగ్గిన, శరీరంలో తగినంత రక్తం లేకపోయినా, రక్త మార్పిడి అవసరము. మన రాష్ట్రంలో అత్యవసరంగా రక్తాన్ని ఎక్కించాల్సిన కేసులు ఎక్కువ కావడం గమనార్హం. రక్తం అవసరమైన వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి, రక్తహీనతతో బాధపడే వారికి, సికిల్ సెల్, తల సేమియా వంటి జన్యు సంబంధ వ్యాధులకు గురైనప్పుడు రక్తమార్పిడి తప్పనిసరి. తల సేమియా వ్యాధిగ్రస్తులకు హిమోగ్లోబిన్ తయారయ్యే జన్యువులు లోపిస్తాయి. వీరికి ప్రతి 20 రోజులకోసారి రక్త మార్పిడి జరగాలి. సికిల్ సెల్, అనీమియా వ్యాధిగ్రస్తులకు ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలోకి మారిపోయి రక్తప్రసరానికి ఆక్సిజన్ సరఫరాకు పనికి రాకుండా పోతాయి. కొంత మంది స్త్రీలలో ప్రసవం తర్వాత పోస్ట్ పార్టం హేమరేజ్ అనే సమస్య వస్తుంది. ఫలితంగా రక్తస్రావ సమస్యకు గురవుతారు. అలాంటి వారికి రక్తమార్పిడి అవసరం అవుతుంది.

రక్తము రకాలు:

రక్తంలో నాలుగు గ్రూపులు ంటాయి. ఏ, బి, ఓ, ఏబి ఆర్హెచ్ పాజిటివ్ లు, నాలుగు ఓ ప్లస్, ఎ ప్లస్, బి ప్లస్, ఏ బి ప్లస్ లు ఉంటాయి. ఆర్ హెచ్ నెగిటివ్ లు నాలుగు ఓ మైనస్, ఏమైనస్, బి మైనస్, ఏ బి మైనస్ గ్రూపుల వారు. నాలుగు గ్రూపుల వారికి రక్తదానం చేసే అవకాశం ఉంటుంది. దేశ జనాభాలో రక్తము 1%ఒకటి నుంచి1.5% వరకు అవసరము అవుతుందని సర్వే రిపోర్ట్ లు తెలియజేస్తున్నాయి. కానీ రక్త సేకరణ మాత్రము 0.80% వరకు రక్తాన్ని సేకరిస్తున్నారు. అంటే మన జనాభాలో 0.20% మంది రక్తం దొరకగా మృత్యువాత పడుతున్నారని గణాంకాలు చెప్తున్నాయి. దీనిని బట్టి రక్తదాన ఆవశ్యకత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. దేశ జనాభాలో ప్రతి వంద మందిలో 400 నుంచి 450 మందికి ఓ ప్లస్ రక్తము, 200 నుంచి 250 మందికి ఏ ప్లస్ రక్తము, 200 నుంచి 250 మందికి బి ప్లస్ రక్తము, 70 నుంచి 80 మందికి ఏబి ప్లస్ రక్తము, ఒక శాతం చొప్పున నెగటివ్ గ్రూప్ రక్తము ఉంటుంది.

ఎర్ర రక్త కణాలు:

రక్తంలో 40- 45 శాతం ఉంటాయి. ఊపిరితిత్తుల నుంచి శరీరంలోని కణాలన్నినీటికీ ఆక్సిజన్ తీసుకువెళ్తాయి. తిరిగి కార్బన్డయాక్సైడ్ ను ఊపిరితిత్తులకు మోసుకు వస్తాయి. రక్తము నుంచి వేరు చేసిన తర్వాత 30-35 రోజుల వరకు నిల్వ ఉంటాయి. వ్యాధులు రాకుండా రక్షించేది మాత్రం తెల్ల రక్త కణాలే.

ప్లాస్మా:

రక్తంలో 55 నుంచి 60 శాతం వరకు ప్లాస్మాకణాలు ఉంటాయి. రక్తంలో ఉండే ద్రవరూపము ప్లాస్మా. ప్లాస్మాలో 92 శాతం నీరు, ఏడు శాతం ప్రోటీన్లు, ఒక శాతం ఖనిజాలు ఉంటాయి. దీని రక్తం నుంచి వేరు చేసిన తర్వాత ఒక ఏడాది వరకు నిల్వ చేయవచ్చు.

ప్లేట్లెట్స్ (రక్త కణాలు):

రక్తము గడ్డ కట్టడానికి, వీటి పరిమాణం తగ్గితే రక్తస్రావాన్ని ఆపడం కష్టం. ప్లేట్లెట్స్ కణాలను తీసిన రోజే అవసరమైన వారికి ఎక్కిస్తారు.

క్రయోప్రెసిపిటెట్ (ఫ్యాక్టర్-8):

హిమోఫిలియా ఉన్నవారికి దీనిని ఎక్కిస్తారు. దీనికి గడ్డ కట్టించే స్వభావం ఉంటుంది.

రక్తదానం చేయాలనుకుంటే :

హైదరాబాద్ నగరంలో సుమారు 150 కి పైగా రక్తనిధి కేంద్రాలున్న రక్తనిది సేకరణకు ప్రభుత్వ ఆసుపత్రులలో గల రక్తనిధి కేంద్రాలకుగాని, రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలకుగాని, అనుమతి పొందిన రక్త నిధి కేంద్రాలకు మాత్రమే ప్రభుత్వం సేకరణకు అనుమతినిచ్చింది. వికారాబాద్ జిల్లా యందు ప్రభుత్వ రక్తనిధి కేంద్రము మరియు తాండూర్ యందు జిల్లా ప్రభుత్వ రక్తనిధి కేంద్రము యందు రక్తదానం చేయాలని సంకల్పం ఉన్నవారురక్త దానం చేయవచ్చు.

రక్తం అవసరమైతే:

రక్తం అవసరమైన వ్యక్తులు నగరంలోని అనుమతి పొందిన రక్తం కేంద్రాల నుంచి రక్తాన్ని తీసుకోవాలి. ప్రభుత్వ, రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రంలో అనాధలకు, పేదవారికి ఉచితంగా, తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగానూ మిగిలిన వ్యక్తులకు ఏ గ్రూపు రక్తం అయినా 1050 రూపాయలకు ఇస్తారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రెడ్ క్రాస్ సేవలు:

1863 అక్టోబర్ 23న ప్రారంభమైన సంస్థ తన సేవలను ప్రజలకు అందించాలని దిశగా కృషి చేస్తుంది. 1998వ సంవత్సరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సాయి చౌదరి రెడ్ క్రాస్ సంస్థను స్థాపించి (ఫౌండర్) 1998 నుండి 2017 జనవరి 11వ తారీకు వరకు ఉమ్మడి రంగా రెడ్డి జిల్లాకు జిల్లా గౌరవ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా విడిపోయిన తర్వాత వికారాబాద్ జిల్లాకు 2017 జనవరి 12వ తారీకు నుండి 2023 ఆగస్టు 5వ తారీఖు వరకు గౌరవ జిల్లా ప్రధాన కార్యదర్శిగా 25 సంవత్సరాల పాటు వ్యవహరించారు. 2023 ఆగస్టు 5వ తారీఖు నుండి వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ గౌరవ చైర్మన్ గా తన విధులను నిర్వహిస్తున్నారు.

నిరంతర సామాజిక సేవకుడు సాయి చౌదరి:

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలకు సుపరిచితులుగా, నిరంతర సామాజిక సేవకుడిగా రాష్ట్ర ,జాతీయ స్థాయిలో అనేకసార్లు గుర్తింపు, గౌరవం అందుకున్నప్పటికీ అదే స్ఫూర్తితో రెట్టింపు ఉత్సాహంతో సమాజ సేవకు పునరంకితమై పేదలకు సేవలందిస్తూ అందరిచే మన్ననలు, ప్రశంసలు అందుకోవటం హర్షణీయం. 52 సంవత్సరాల వయసు గల సాయి చౌదరి మూడున్నర దశాబ్దాలుగా సమాజ సేవయే పరమావధిగా పనిచేస్తూ, పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారు. 1990 సంవత్సరం నుండి ఇప్పటివరకు 117 సార్లు స్వచ్ఛంద రక్తదానం చేసి, ప్రజల మన్ననలు పొందినారు. ఇప్పటివరకు సుమారు రెండు లక్షల యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలు మరియు రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రాల ద్వారా సేకరించినారు. సాయి చౌదరి చేసినటువంటి సేవలకు గాను ఏడుగురు గవర్నర్ల చేతుల మీదుగా 18 బంగారు పతకాలు, 2గోల్డ్ ప్లేటెడ్ సిల్వర్ మెడల్స్, 4 సేవా అవార్డులు మరియు జాతీయస్థాయిలో అనేక అవార్డులను సాయి చౌదరి అందుకోవటం గొప్ప సంతోషదాయకం.సాయి చౌదరి చేస్తున్న సేవలకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2004లో కూకట్ పల్లి హైటెక్ రైల్వే స్టేషన్ వద్ద వెయ్యి గజాల స్థలము రక్త నిధి కేంద్రం ఏర్పాటు చేసుకొనుటకు గాను (ప్రస్తుత మేడ్చల్ జిల్లా) మరియు 2008లో గౌలిదొడ్డి యందు (గోపనపల్లి) వెయ్యి గజాల స్థలమును రక్త నిధి కేంద్రం ఏర్పాటు చేసుకొనుటకు ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రభుత్వము రెడ్ క్రాస్ సొసైటీ కింద ఇవ్వటం జరిగింది. వికారాబాద్ జిల్లా యందు తన ఆధ్వర్యంలో వికారాబాద్ మరియు తాండూర్ యందు రక్త నిధి కేంద్రాలను ఏర్పాటు చేసి, 2006లో పరిగి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (2007)ఇబ్రహింపట్నం యందు గల రక్త నిల్వ కేంద్రాలను సాయి చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది.

జెమినీ టీవీ లో సరికొత్త సీరియల్స్ రాధ మరియు మూడు ముళ్ళు....

- ఈ నెల 30 నుండి ప్రారంభం

హైద్రాబాద్. సెప్టెంబర్ 30(దక్షిణాది న్యూస్):అమ్మ చేతి ముద్ద

, చందమామ రావే జాబిల్లి రావే , ఇవేగా మనకి అమ్మ ని జ్ఞాపకం తెచ్చే మధుర స్మృతులు . కానీ అలాంటి జ్ఞాపకాలు ఏమీ లేకుండా ఉంది ఖుషి . అమ్మ ని పొందాలని ఆరాటపడే ఖుషికి మన రాధ ఎదురవడింది . అమ్మని తలపించింది . దాంతో ఖుషి రాధే తనకి అమ్మలా రావాలని పట్టు పట్టింది . మరి రాధ ఖుషి కి అమ్మ కాగలిగిందా రాధ ఎన్ని ఒడిదుడుకులని ఎదుర్కొంది ఎలా దైవం తనకి ఇచ్చిన బాధ్యతని నిర్వర్తించింది ? ఎలా తన జీవితాన్ని సాగించింది చూడాలంటే ? చూడండి మన జెమినీ టీవీ లో సరికొత్త డైలీ సీరియల్ రాధ... ఈ నెల 30 నుండి ప్రారంభం .సోమవారం నుండి శనివారం వరకు రాత్రి 8:30 గంటలకు .

నీలవేణిపల్లెపాలెం అనే ఒక చిన్న గ్రామంలో తన ఇద్దరు చెల్లెళ్లే తన ప్రపంచంగాబతుకుతుంటుంది మూడు ముళ్ళు వేసేవాడు తన జీవితంలోకి వస్తేతన చెల్లెళ్ల జీవితాలు ఏమైపోతాయో అనుకుని పెళ్లే వద్దనుకుంటుంది.అలాంటి నేలవేణి జీవితంలోకి తన ప్రమేయమే లేకుండా ఓ వ్యక్తి ప్రవేశించి తన మెడలో మూడు ముళ్ళు వేస్తే ?తనది కాని ప్రపంచంలోకి ఏడు అడుగులు వేసిన నీలవేణికి అడుగడుగునా సమస్యల అగాధాలు ఎదురైతే,వాటిని ఆమె ఎలా ఎదుర్కొంది...చూడండి మన జెమినీ టీవీ లో సరికొత్త సీరియల్ మూడు ముళ్ళు.... ! ఈ నెల 30 నుండి ప్రారంభం.. సోమవారం నుండి శనివారం వరకు రాత్రి 09:00 గంటలకు

కోడెలను దైవ రూపంగా భావించి చూసుకోవాలి

-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

-రైతులకు ఉచిత కోడెల పంపిణి

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 30: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో తిప్పాపూర్ గోశాలలో సోమవారం రెండో విడత కోడెల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ముఖ్యఅతిథిగా హాజరై, రైతులకు కోడెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూదక్షిణ కాశీగా పేరు గాంచిన శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు ప్రత్యేక అనుబంధంతో ఎక్కడెక్కడ నుంచో వేములవాడకు వచ్చి తమ ఆకాంక్షలు తీరాలని రాజన్నకు కోడె కడతారని అన్నారు.ప్రతి నిత్యం భక్తుల కోలాహలంతో స్వామి,అమ్మ వార్ల దర్శనం తో పాటు కోడె మొక్కులు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని,

దేశంలో ఎక్కడ లేని విధంగా కోడె మొక్కులు చెల్లించే ఆచారం వేములవాడ రాజన్న అలయంలో ఉందన్నారు.అర్హులైన పేద రైతులకు రెండో విడిత పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చోరువతో అర్హులైన పేద రైతులకు కోడెలను అందిస్తున్నామని, గతంలో నేను దేవస్థాన ఛైర్మెన్ గా ఉన్నా సమయం లో కోడెలను పంపిణీ చేసామన్నారు.

గత మూడు నెలల క్రితం సుమారు 1600 పై చిలుకు కోడెలను పంపిణీ చేసామన్నారు.

రాజన్న ప్రసాదంగా కోడెలను భావించాలని, గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలు, ఆవులు ఇతరత్రా పనులకు వినియోగించుకోకుండా అర్హులకు మాత్రమే అందేలా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి వారి ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించడం జరిగిందన్నారు.

కోడెలను పొందిన రైతులు వీటిని జాగ్రత్తగా దైవ రూపంగా భావించి చూసుకోవాలి, వీటిని ఇతరులకు విక్రయించడానికి వీలు లేదని, సొంత వ్యవసాయానికి మాత్రమే వినియోగించుకోవాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని,

రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేసామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయానికి గత బడ్జెట్ లో 50 కోట్లు కేటాయించిందని,అర్హులైన రైతులకు ఉచితంగా కోడల పంపిణీ కార్యక్రమం నిరంతరం ప్రక్రియగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

-బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 30: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫెడరేషన్ అఫ్ బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రధాన ద్వారం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం, టెన్యూర్ పిపి నియామకం, 41(ఎ) సిఆర్పిసి, 35 బిఎన్ఎస్ఎస్, సిఆర్పిసి అమెండ్మెంట్తదితర అంశాలను వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, కేశన్న గారి గోపికృష్ణ, కిషోర్ రావు, రేగుల దేవేందర్, నక్క దివాకర్, జంగం అంజయ్య, పర్లపెల్లి అంజయ్య, గడ్డం సత్యనారాయణరెడ్డి, సంటి సుజీవన్, పారువెల్ల శ్రీనివాస్, పంపరి శంకరయ్య, నేదూరి అభిలాష్ జెట్టి శేఖర్ గుజ్జే మనోహర్, రేగుల రాజ్ కుమార్, బొజ్జ నరేష్, మారుమొకం అనిల్ కుమార్, కనికరపు శ్రీనివాస్, దొబ్బల ప్రవీణ్, మహేష్, మహిళా న్యాయవాదులు జక్కుల పద్మ, సయీమా నాసారి ఉన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షునిగా సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ గెలుపు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 30: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో సబ్ డివిజన్ ఆటో యూనియన్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి . ఈ పోటీల్లో ముగ్గురు అభ్యర్థులు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బత్తుల దేవరాజు, సయ్యద్ ఉమర్ లు పోటీ పోటీపడ్డారు. ముగ్గురు అభ్యర్థులు నువ్వా నేనా అన్నట్టుగా ప్రచారం నిర్వహించారు. సాయంత్రం కౌంటింగ్ నిర్వహించగా తర్వాత యూనియన్ అధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ భారీ మెజార్టీతో గెలుపొందారు. . అయితే ఎన్నికల కౌంటింగ్ కేంద్రం

వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా వీరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు..

రాష్ట్ర స్థాయి యునైటెడ్ షూటింగ్ బాల్ పోటీలకు పలువురి ఎంపిక

కరీంనగర్, సెప్టెంబర్ 30: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ జిల్లా బొమ్మగల్ లోని స్థానిక తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ బాయ్స్ వన్ లో 28వ తేదీ రోజున నిర్వహించిన కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల43వ అండర్ 19 బాల బాలికల షూటింగ్ బాల్ టోర్నమెంట్ సెలెక్షన్లో సుమారు 280 మంది బాల బాలికలు పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీల్లో బాలుర విభాగంలో మొదటి స్థానం మైనార్టీ బాయ్స్-3ముక్కంపూర్, రెండవ స్థానం మానకొండూర్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ రెండో స్థానం, మూడవ స్థానం బొమ్మకల్ మైనార్టీ బాయ్స్ -1 బాలికల విభాగంలో మొదటి స్థానం ఆల్ ఫోర్స్ గోపాలరావుపేట్ స్కూల్, రెండవ స్థానంలో ఆల్ ఫోర్స్ జెనెక్స్ట్ హైస్కూల్ వావిలాలపల్లి, మూడో స్థానంలో శ్రీవిద్య భారతీయ

హై స్కూల్ కైవాసం చేసుకుంది. ఈ క్రీడా పోటీలో సెలెక్ట్ అయిన వారు సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్లో నిర్వహించే అక్టోబర్ మూడు నాలుగు ఐదు తేదీల్లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని కరీంనగర్ ఉమ్మడి జిల్లా షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ముహమ్మద్ ముఫాజిల్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మానకొండూర్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంపతి, కరీంనగర్ జిల్లా షూటింగ్ బాల్ ఉపాధ్యక్షులు మేకల సత్తయ్య, మైనార్టీ బాయ్స్ వన్ స్కూల్ వార్డెన్ సైఫుల్లా, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సంతోష్, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ మునీరుద్దీన్, డానియల్ ,కుమార్, శ్రీధర్, అనిల్ ,శ్రీనివాస్ ,అశోక్ ,రాజు, ఫక్రుద్దీన్, వినోద్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు కోచ్లు తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రియైన ఇంజనీర్ రత్నలక్ష్మికి సహస్ర భాషాభిజ్ఞ బిరుదు పురస్కారం ప్రదానం

హైదరాబాద్, సెప్టెంబర్ 30:నిరంతరం సాహిత్య సేవలో మమేకమై తెలుగు భాషాభివృద్ధికై పాటుపడుతూ అనన్య ప్రక్రియలలో కవితలు విరచిస్తున్న రత్నలక్ష్మి తెలుగు నూతన సాహిత్య ప్రక్రియైన సున్నితం సరళ శతకంలో సహస్ర సున్నితాలను అద్భుతమైన భావ పదజాలంతో కవిత్వీకరించినందుకు, సాహితీ బృందావన విహార జాతీయ వేదిక వ్యవస్థాపకురాలు మరియు అధ్యక్షురాలైన నెల్లుట్ల సునీత మెచ్చి నంద్యాల జలవనరుల శాఖలోని తెలుగుగంగ ప్రాజెక్టులో అసిస్టెంట్ ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్న ఎస్. రత్నలక్ష్మి యొక్క సాహిత్య సేవలను అభినందిస్తూ ప్రత్యేక ప్రశంసలతో సత్కరించి సగౌరవంగా సహస్ర భాషాభిజ్ఞ బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సున్నితం ప్రక్రియ రూపకర్త నెల్లుట్ల సునీత, దేవికారాణి రత్నాకర్, మోదేపల్లి సీనమ్మ, బోనగిరి ఉమాదేవి,పలువురు సాహితీ మిత్రులు మరియు పట్టణ ప్రముఖులు రత్నలక్ష్మిని శుభాభినందనలతో ముంచెత్తారు.

పిజియన్ ఎయిర్‌టర్బో హ్యాండ్‌హెల్డ్ డ్రై వాక్యూమ్ క్లీనర్ మార్కెట్లోకి

హైదరాబాద్, సెప్టెంబర్ 30:వినూత్నమైన ఇల్లు, వంటగది, లైటింగ్ సొల్యూషన్స్‌లో అగ్రగామిగా ఉన్న స్టవ్ క్రాఫ్ట్, ఇల్లు ఆటోమోటివ్ వినియోగానికి సంబంధించి శుభ్రపరచడంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి రూపొందించిన ఎయిర్‌టర్బో హ్యాండ్‌హెల్డ్ డ్రై వాక్యూమ్ క్లీనర్‌ను ప్రారంభించినట్లు మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్ర గాంధీ తెలిపారు . ఈ వినూత్న వాక్యూమ్ క్లీనర్ అధునాతన స్టీల్మేష్ ఎఫ్ ఎఫ్ టి టెక్నాలజీని ఆకట్టుకునే 18 కె సక్షన్ పవర్‌తో మిళితం చేస్తుందని అన్నారు , ఇది మీ స్థలంలోని ప్రతి మూలను మచ్చలేనిదిగా ఉండేలా చూస్తుంది. స్టవ్‌క్రాఫ్ట్ మాట్లాడుతూ, "ఇన్నోవేషన్ పట్ల మా నిబద్ధత కస్టమర్ అంచనాలకు అనుగుణంగా మించిన ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి మాకు స్ఫూర్తినిస్తుంది. ఎయిర్‌టర్బో నాణ్యత, పనితీరు స్థోమత పట్ల మా అంకితభావానికి నిదర్శనం, భారీ, భారీ వాక్యూమ్ క